TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక

JANAM POWER

కరీంనగర్ ఆదివారం 24.08.2025 సంపుటి : 10 సంచిక : 88 పేజీలు : 8 వెల 05/-

Karimnagar Sunday 24.08.2025 Volume : 10 Issue : 88 Pages : 8 Cost 05/-




EDITOR:
BANDARI MARUTHI



# ఫిరాయించొనోళ్లపై వేటు తప్పదా?

నోటీసులు పంపించిన స్పీకర్

గతంలో చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు

తాజాగా స్పందించిన న్యాయస్థానం

కేవలం నోటీసులకే పరిమితమా? చర్యలు తీసుకుంటారా?

**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల వివాదం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తాజాగా నోటీసులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్న స్పీకర్, మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న ఆదేశాలను పాటిస్తారా? లేక నోటీసులతో సరిపెట్టి వదిలేస్తారా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఫిరాయింపులపై దశాబ్దాలుగా అమల్లో ఉన్న యాంటీ డిఫెక్షన్ లా (పదవ షెడ్యూల్)

..మిగతా 2లో

# యూరియా కొరతపై ప్రభుత్వ ఫోకస్



యూరియా కోసం రైతులు క్యూలైన్లలో పడిగాపులు

రాష్ట్ర ప్రభుత్వంపై విపక్షాల నిరసనలు

కేంద్ర సరఫరా చేసిన రాష్ట్రమే దాస్తుందని బీజేపీ విమర్శలు

సమస్య పరిష్కారం దిశగా సత్వర అడుగులు

లారీ అసోసియేషన్స్ మధ్య పోటీతో ఇబ్బందులు

రంగంలోకి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణలో యూరియా కొరత రైతులు, రాజకీయ నాయకుల మధ్య చిచ్చు పెడుతోంది. యూరియా కోసం రైతులు క్యూలలో పడిగాపులు కాస్తున్నారు. ఈ అంశంలో విపక్షాలు ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపుతున్నాయి. ఈ సమస్యపై కాంగ్రెస్ కేంద్రంపై విమర్శలు చేస్తుండగా.. బీజేపీ నేతల కాంగ్రెస్ మీద ఆరోపణలు చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి మంత్రి తుమ్మల

..మిగతా 2లో

## వాటర్ బాటిల్‌కు వంద రూపాయలా?

దాని ఎమ్మార్పీ ధర ఇరవై రూపాయలే కదా..

మీరు 80 రూపాయలు ఎక్కువ ఎందుకు వసూలు చేస్తున్నారు?

రెస్టారెంట్లను ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు

సర్వీస్ చార్జీలు వేయడంపై తీవ్ర ఆగ్రహం

3





## టిక్‌టాక్‌పై నిషేధం కొనసాగుతుంది

భారత్‌లో మళ్లీ అందుబాటులోకి అంటూ ప్రచారం

2020లో కేంద్ర ప్రభుత్వం నిషేధం

కేంద్రప్రభుత్వం క్లారిటీ

3

## మంత్రులు బాధ్యతగా ఉండాలి

కేంద్రం ప్రభుత్వంపై రాష్ట్రం విమర్శలు తగవు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తమను సంప్రదించలేదు

పొంగులేటిని కలిసిన అనంతరం ఎంపీ ఈటల



**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణకు కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రావాలని భాజపా ఎంపీలుగా తాము కూడా కోరుకుంటామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భాజపా ఎంపీలమైనప్పటికీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. యూరియా సమస్య కూడా పరిష్కారం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు బాధ్యతగా ఉండాలని, అనవసరంగా కేంద్రంపై విమర్శలు చేయెుద్దన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై

..మిగతా 2లో



## సురవరం సుధాకర్ రెడ్డికి పలువురి నివాళి

పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులు

అభిమానుల సందర్శనార్థం నేడు హిమాయత్ నగర్ ఆఫీసులో..

3

## ధర్మస్థలి కేసు .. అంత ఉత్తదేనా?

మాట మార్చిన ముసుగు వ్యక్తి

## బాలిక హత్యకేసు.. జువైనల్ కోర్టుకు నిందితుడు

2

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు

3

# అమెరికాకు తగ్గిన వలసలు

ట్రంప్ నిర్ణయాలతో వెనక్కి తగ్గుతున్న వైనం

అరెస్టులు, చట్టపరమైన ఆంక్షలతో ఉక్కిరి బిక్కిరి



**జనం పవర్, హైదరాబాద్ :**

మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునేవారి సంఖ్య

..మిగతా 2లో







Contact: 96181 81112



# వరంగల్ లో ఎస్సై వీరంగం

జనం పవర్, హైదరాబాద్ :

వరంగల్‌లో ఓ ఎస్సై రెచ్చిపోయాడు. మహిళ అని కూడా చూడకుండా దాడికి పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదేం దారుణం అంటూ ప్రశ్నిస్తున్నారు. మిల్స్ కాలనీ స్టేషన్‌కు సంబంధించిన ఎస్సై శ్రీకాంత్ అర్ధరాత్రి వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఓ రెస్టారెంట్‌కు వచ్చాడు. వచ్చీరాగానే హోటల్ నిర్వాహకులపై దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా మహిళ చెంప చెల్లుమనిపించాడు. అక్కడే ఉన్న మగవాళ్లపై కూడా శ్రీకాంత్ దాడికి పాల్పడ్డాడు. ఎస్సై దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. అయితే బాధిత మహిళ మిల్స్ కాలనీ స్టేషన్‌కు వెళ్లి ఎస్సైపై ఫిర్యాదు చేసింది. తనపై అన్యాయంగా దాడి చేశాడంటూ కంప్లైంట్ ఇచ్చింది. ఏదైనా తప్పు జరిగితే జరిమానా విధించాలి.. లేదంటే మూసేమని చెప్పాలి కానీ.. ఇలా మహిళపై దాడి చేయడమేంటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# అమెరికాకు తగ్గిన వలసలు



(మొదటి పేజీ తరువాయి)

తగ్గిపోతోంది. ఇదే విషయాన్ని ప్యూ రీసెర్చ్ సెంటర్ నివేదిక వెల్లడించింది.

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య వలస జనాభా 15 లక్షలు తగ్గింది. దాంతో ఇమిగ్రెంట్స్ సంఖ్య 53.3 మిలియన్ల నుంచి 51.9 మిలియన్లకు పడిపోయింది. 1960 తర్వాత ఇలా వలసదారుల సంఖ్య క్షీణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇది అనూహ్య మార్పును సూచిస్తోందని ప్యూ రీసెర్చ్ సెంటర్ డెమోగ్రాఫర్ జెఫ్రి పస్సెల్ మీడియాకు వెల్లడించారు. ఈ క్షీణత లేబర్ మార్కెట్‌పై పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.
''అమెరికా (USA) జనాభాలో పనిచేసే వయసున్న వ్యక్తుల సంఖ్య పెరగడం లేదు. అలాంటప్పుడు ఈ దేశానికి వలసల నుంచే శ్రామికశక్తి లభిస్తుంది. ఈ శ్రామికశక్తి పెరగకపోతే.. ఆర్థిక వ్యవస్థకు కష్టమే'' అని జెఫ్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దుల నుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశించే వారి సంఖ్యను కట్టడి చేసేందుకు బైడెన్ హయాంలో చర్యలు తీసుకోవడంతో 2024 నుంచే ఈ మార్పు కనిపిస్తున్నప్పటికీ.. ట్రంప్ కఠిన వైఖరితో అది భారీగా పెరిగింది. అనధికారిక వలసల సంఖ్య కూడా తగ్గిందని నివేదిక పేర్కొంది. మాస్ డిపోర్టేషన్లు, బహిష్కరణను తప్పించేందుకు ఉన్న రక్షణలు తొలగించడమూ ఈ సంఖ్య తగ్గడానికి కారణమని వెల్లడించింది.

# హైడ్రా.. ఒకటి రెండేళ్లకు పరిమితం కాదు: రంగనాథ్



జనం పవర్, హైదరాబాద్ :

హైడ్రాపై ప్రజలకు మరింత క్లారిటీ రావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''హైడ్రా.. ఒకటి రెండేళ్లకు పరిమితం కాదు. వందేళ్ల ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ప్రస్తుతం ఆరు చెరువులు అభివృద్ధి చేస్తున్నాం. సీఎస్ఆర్ పేరుతో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. సాంకేతిక ఆధారాలతో ఎఫ్‌టీఎల్ మార్కు చేస్తున్నాం. చెరువుల వద్ద భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. వీటితో పాటు నాలాలను నోటిఫై చేస్తున్నాం

రాజకీయ ఉద్దేశంతో హైడ్రా పని చేయడం లేదు. విపత్తుల నుంచి నగర ప్రజలను రక్షించేందుకు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్ఆర్ వరకు ఉన్న చెరువులకు సంబంధించి ఈ ఏడాది పూర్తిస్థాయిలో తుది నోటిఫికేషన్‌పై దృష్టి సారించాం. అనేక అవరోధాలు, విమర్శలను ఎదుర్కొంటూ హైడ్రా ఏడాది కాలంగా ముందుకు సాగుతోంది. ప్రజల్లో హైడ్రా పట్ల నమ్మకం పెరిగిందనడానికి కూకట్‌పల్లి నల్ల చెరువు నిదర్శనం'' అని రంగనాథ్ తెలిపారు.

# ఫిరాయించొనోళ్లపై వేటు తప్పదా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావవంతంగా పనిచేస్తుందా? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



**2023 ఎన్నికల తర్వాత ఫిరాయింపుల జోరు**
2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఈ వివాదం మొదలైంది. వీరిలో కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, సంజయ్ కుమార్, తెల్లం వెంకటరావు, అరికపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి ఉన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీ రామారావు (కేటీఆర్), పాడి కౌశిక్ రెడ్డి ఈ ఫిరాయింపులపై స్పీకర్‌కు పిటిషన్ దాఖలు చేశారు. యాంటీ డిఫెక్షన్ లా ప్రకారం, పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అయితే, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ (కాంగ్రెస్ నేత) ఆలస్యం చేయడంతో బీఆర్ఎస్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సింగిల్ బెంచ్ నాలుగు వారాల్లో షెడ్యూల్ నిర్ణయించాలని ఆదేశిస్తే, డివిజన్ బెంచ్ దాన్ని కొట్టేసి 'సహేతుక సమయంలో' నిర్ణయం తీసుకోవాలని చెప్పింది.

**సుప్రీంకోర్టు జోక్యం: మూడు నెలల గడువు**
హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జూలై 31, 2025న సుప్రీంకోర్టు బెంచ్ (జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసిహ్) కీలక తీర్పు ఇచ్చింది. స్పీకర్ మూడు నెలల్లో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. 'ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్' అంటూ స్పీకర్ ఆలస్యాన్ని తప్పుపట్టింది. యాంటీ డిఫెక్షన్ లా ఉద్దేశ్యం ఫిరాయింపులను అరికట్టడమేనని, కానీ స్పీకర్ల ఆలస్యాలు దాన్ని బలహీనపరుస్తున్నాయని వ్యాఖ్యానించింది. స్పీకర్‌కు అనర్హత నిర్ణయ బాధ్యత అప్పగించడం సరైందేనా? అని పార్లమెంటును ప్రశ్నించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు విచారణను ఆలస్యం చేస్తే వారిపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతుందని హెచ్చరించింది. సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ స్వాగతించింది. కానీ స్పీకర్ ఆలస్యం చేస్తారన్న ఆందోళన వ్యక్తం చేసింది. ఆగస్టు 1న బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌ను త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**తాజా పరిణామాలు: నోటీసుల జారీ**
సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత స్పీకర్ న్యాయ నిపుణులు, అడ్వకేట్ జనరల్‌తో చర్చించారు. ఆగస్టు 21న పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు (కొన్ని వర్గాల్లో మొదట ఐదుగురికి, తర్వాత మిగిలిన వారికి జారీ చేసినట్టు చెబుతున్నారు). ఎమ్మెల్యేలు తమ వివరణ సమర్పించాలని సూచించారు. అయితే, నోటీసుల్లో విచారణ సమయం పేర్కొనలేదు. ఇది మరిన్ని ఆలస్యాలకు దారి తీస్తుందా? అన్న సందేహాలు ఉన్నాయి. ఇప్పటికే గడువు ముగిసే సమయంలో నోటీసులు జారీ చేయడం వెనుక స్పీకర్ వ్యూహం ఏమిటి? బీఆర్ఎస్ పార్టీ ఆధారాలు సమర్పించాల్సిన భారం ఉందని, ఎమ్మెల్యేలు 'కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం దూరమయ్యాము' అని వాదిస్తే విచారణ సంక్లిష్టమవుతుందని నిపుణులు అంటున్నారు.

**మినహాయింపు సాధ్యమేనా?**
యాంటీ డిఫెక్షన్ లా ప్రకారం, పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హులవుతారు. కానీ రెండు మూడవ వంతుల మంది (మెర్జర్) మారితే మినహాయింపు ఉంటుంది. ఇక్కడ పది మంది మాత్రమే కాబట్టి మినహాయింపు లేదు. సుప్రీంకోర్టు స్పీకర్ అధికారాలపై సందేహాలు వ్యక్తం చేసింది. స్పీకర్ రూలింగ్‌ను కోర్టులు సవాల్ చేయలేవు కానీ, ఆలస్యాలపై జోక్యం చేసుకోవచ్చు. గడువు ముగిస్తే సుప్రీంకోర్టు మరిన్ని ఆదేశాలు ఇవ్వవచ్చు. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో స్పీకర్ ఒత్తిడికి గురవుతారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్, ఎమ్మెల్యేలను రక్షించాలని చూస్తుంది. ఇది అసెంబ్లీలో కాంగ్రెస్ బలాన్ని పెంచుతుంది. మరోవైపు, బీఆర్ఎస్ ఈ వివాదాన్ని రాజకీయంగా వాడుకుని కాంగ్రెస్‌పై 'హార్స్ ట్రేడింగ్' ఆరోపణలు చేస్తోంది. బీజేపీ కూడా సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించింది. కాంగ్రెస్ అధిష్ఠానం (హైకమాండ్) ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ బీఆర్ఎస్‌ను బలహీనపరచాలని చూస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలతో సమావేశాలు జరిపి నిధులు వాగ్దానం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్పీకర్ వ్యూహం: నోటీసులు ఇచ్చి సుప్రీంకోర్టును సమాధానపరచడం, కానీ విచారణ ఆలస్యం చేసి అనర్హత నివారించడం కావచ్చు. లేకపోతే గడువు పొడిగింపు కోరవచ్చు. ఫిరాయింపులు ఓటర్ల మ్యాండేట్‌ను దెబ్బతీస్తాయి. సుప్రీంకోర్టు 'ఫౌండేషన్ ఆఫ్ డెమాక్రసీ'ని రక్షించాలని చెప్పింది. ఇలాంటి కేసులు (మహారాష్ట్ర, మధ్యప్రదేశ్)లో స్పీకర్లు రాజకీయ పక్షపాతం చూపారు. తెలంగాణలో కూడా అదే జరిగితే యాంటీ డిఫెక్షన్ లా సమీక్ష అవసరమవుతుంది.

**ఉత్కంఠకు తెరపడేదెప్పుడు?**
స్పీకర్ నోటీసులు జారీ చేయడం సానుకూల అడుగు కానీ, అనర్హత వేటు తప్పదా? లేక విచారణ ఆలస్యమవుతుందా? అనేది ఎమ్మెల్యేల వివరణలు, స్పీకర్ నిర్ణయంపై ఆధారపడి ఉంది. సుప్రీంకోర్టు గడువు ముగిసేలోపు నిర్ణయం లేకపోతే మరో లీగల్ డ్రామా తప్పదు. రాజకీయంగా ఇది కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య పోరును మరింత రాజేస్తుంది. ఫిరాయింపుల సంస్కృతి మారాలంటే యాంటీ డిఫెక్షన్ లా బలోపేతం అవసరం.



# మంత్రులు బాధ్యతగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తమను సంప్రదించలేదని ఈటల పేర్కొన్నారు. తమ దృష్టికి వచ్చిన కొందరు పేదల జాబితాను మంత్రి పొంగులేటికి ఇచ్చినట్టు తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణం రూ.5 లక్షలతో పూర్తయ్యే పరిస్థితి లేదని, కనీసం రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో వాటిలో దొంగలు పడుతున్నారన్నారు. జవహర్‌నగర్‌లో మాజీ సైనికోద్యోగులకు సంబంధించిన భూముల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను కూల్చడం సరికాదన్నారు.

# బాలిక హత్యకేసు.. జువైనల్ కోర్టుకు నిందితుడు

జనం పవర్, హైదరాబాద్ :

కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో నిందితుడైన బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. అంతకుముందు అతడిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు. బాలిక హత్య కేసు వివరాలను మధ్యాహ్నం పోలీసులు వెల్లడించనున్నారు. ఈ నెల 18న పదేళ్ల బాలిక సహస్రను పదో తరగతి బాలుడు హత్య చేశాడు. క్రికెట్ బ్యాట్ చోరీ కోసం వచ్చిన అతడు.. బాలిక చూడటంతో ఈ దారుణానికి ఒడిగట్టాడు. అంతకుముందు దొంగతనం ఎలా చేయాలి.. ఎలా తప్పించుకోవాలో ఆన్‌లైన్‌లో శోధించాడు. ఈ వివరాలన్నీ బాలుడు కాగితంపై రాసుకున్నట్లు సమాచారం.



కేసు విచారణలో భాగంగా బాలానగర్, కూకట్‌పల్లి పోలీసులు, ఎస్‌వోటీ సిబ్బంది నాలుగు రోజులుగా వందలాది సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఆ ఇంట్లోకి ఎవరూ వెళ్లినట్టు కన్పించకపోవడంతో తెలిసిన వారి పనేనని అంచనాకు వచ్చారు. ఆ దిశగా విచారణ జరిపినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో నిందితుడు నివాసం ఉండే అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..'హత్య జరిగిన రోజు ఓ బాలుడు గోడదూకి అపార్ట్‌మెంట్‌లోకి రావడాన్ని గమనించానంటూ' కూకట్‌పల్లి పోలీసులకు సమాచారమివ్వడంతో ఆ దిశగా విచారించారు.
అతను చెప్పిన రూపురేఖల ఆధారంతో బాలుడు సమీపంలోని పాఠశాలలో చదువుతున్నట్లు గుర్తించి ఆరా తీశారు. బాలుడు హత్య జరిగిన రోజు పాఠశాలకు రాలేదని తెలుసుకున్నారు. అనంతరం ఇంటి వద్దనే బాలుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో నిజం అంగీకరించినట్టు సమాచారం. 'హత్య చేసింది తానేనని, హత్య అనంతరం కత్తిని అక్కడే కడిగి ఇంటికి తీసుకొచ్చి రిఫ్రిజిరేటర్‌పై ఉంచానని, రక్తపు మరకలు అంటిన టీషర్ట్‌ను వాషింగ్ మెషిన్‌లో వేశానని' పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

# యూరియా కొరతపై ప్రభుత్వ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వరరావు రంగంలోకి దిగారు. కీలక చర్యలకు ఉపక్రమించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మీ కోసం..



ప్రస్తుతం తెలంగాణలో రైతంగాన్నే కాక రాజకీయాల్లో కూడా యూరియా సమస్య ప్రకంపనలు సృష్టిస్తోంది. యూరియా కోసం రైతులు.. క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. దీనిపై విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నాయి. ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అని మండిపడుతున్నాయి. అయితే తమ విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేంద్రం ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేసిందని.. రాష్ట్ర ప్రభుత్వమే దాన్ని బ్లాక్‌లో అమ్ముకుంటుందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అన్నదాతలు కూడా యూరియా కొరత మీద ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా సమస్య తీవ్రమవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దీని పరిష్కారం కోసం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక చర్యలకు పూనుకున్నారు. యూరియాను సరఫరా చేయడంలో ఆలస్యానికి తావు లేకుండా.. దాన్ని వెంట వెంటనే కేంద్రాలకు తరలించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ వారిని అప్రమత్తం చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని జిల్లాల్లో లారీ అసోసియేషన్స్ మధ్య పోటీ ఏర్పడి.. యూరియా రవాణా నిలిచిపోయింది. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ట్రాన్స్‌పోర్ట్ సమస్యను స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తున్నారు.



# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు

జనం పవర్, హైదరాబాద్ :

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మళ్ళీ తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ నుండి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు చేపట్టారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే తాను పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంను కలిశానని కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహా ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందాయి. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఈ పిటిషన్లపై జూలై 31న తుది తీర్పు వెలువరించింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసింది. విచారణకు ప్రభుత్వంలో ఉన్నవారు ఎవరూ ఆటంకాలు కలిగించరాదని, సాకులు చెప్పి విచారణను వాయిదా వేస్తే అది రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలందరూ ఏదో ఒక రోజు అనర్హత విచారణను ఎదుర్కోవాల్సిందేనని వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదులపై వివరణ ఇవ్వాలని కోరుతూ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించిన కృష్ణమోహన్ రెడ్డి.. తనకు నోటీసులు అందిన విషయాన్ని ధృవీకరించారు. అయితే, తాను పార్టీ మారలేదని, కాంగ్రెస్‌లోకి వెళ్లలేదని స్పష్టం చేశారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశానని, తాను ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని తెలిపారు. తన తరఫు న్యాయవాదుల ద్వారా త్వరలోనే నోటీసులకు సమాధానం ఇస్తానని చెప్పారు.

# టిక్‌టాక్‌పై నిషేధం కొనసాగుతుంది




**భారత్‌లో మళ్లీ అందుబాటులోకి అంటూ ప్రచారం**

**2020లో కేంద్ర ప్రభుత్వం నిషేధం**

**కేంద్రప్రభుత్వం క్లారిటీ**

జనం పవర్, హైదరాబాద్ :

షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ సేవలు భారత్‌లో మళ్లీ అందుబాటులోకి వచ్చాయంటూ ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. అందులో ఏమాత్రం నిజం లేదని, టిక్‌టాక్‌పై నిషేధం ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశాయి. 'టిక్‌టాక్‌ను అన్‌బ్లాక్ చేసేలా భారత ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. దీనిపై వస్తోన్న వార్తలన్నీ అవాస్తవం, తప్పుదోవ పట్టించే కథనాలే'' అని సదరు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ వెబ్‌సైట్‌ను ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు బ్లాక్‌లిస్ట్‌లోనే ఉంచాయని తెలిపాయి. కానీ, కొంతమంది యూజర్లకు ఇది ఎలా అందుబాటులోకి వచ్చిందో స్పష్టత లేదని వెల్లడించాయి. 2020లో సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతాపరమైన కారణాలతో చైనాకు చెందిన ఈ వీడియో మేకింగ్ ప్లాట్‌ఫామ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అయితే, శుక్రవారం చాలామంది యూజర్లు తమకు టిక్‌టాక్ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే, వెబ్‌సైట్ ఓపెన్ అవుతున్నప్పటికీ.. యూజర్లు అందులో లాగిన్ అవలేకపోతున్నారు. వీడియోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. అటు యాప్ స్టోర్స్‌లోనూ ఈ యాప్ అందుబాటులోకి రాలేదు. భారత్‌చైనా మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపడుతున్న వేళ.. 'టిక్‌టాక్' అందుబాటులోకి వచ్చిందన్న వార్త చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ వర్గాలు దీనిపై స్పష్టతనిచ్చాయి. 2020 జూన్‌లో 59 యాప్‌లు, సెప్టెంబర్‌లో మరో 118 చైనీస్ యాప్‌లపై భారత ప్రభుత్వం నిషేధం విధించి ఆ దేశ కంపెనీలకు గట్టి షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. సరిహద్దులోని గల్వాన్ వద్ద భీకర ఘర్షణ తర్వాత చైనా తీరుపై ఆ దేశంలో అనేక అనుమానాలు వ్యక్తమై భారతీయుల సమాచార భద్రత, గోప్యత, దేశ సార్వభౌమత్వానికి భంగం కలుగుతోందన్న కారణాల రీత్యా టిక్‌టాక్, హెలో, పబ్‌జీ, షేరిట్, యూసీ బ్రౌజర్, బైదు మ్యాప్, క్లాష్ ఆఫ్ కింగ్స్ వంటి యాప్‌లపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది.

# ధర్మస్థలి కేసు .. అంత ఉత్తదేనా?

**మాట మార్చిన ముసుగు వ్యక్తి**

జనం పవర్, హైదరాబాద్ :



కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో వందల మృతదేహాల ఖననం ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ మృతదేహాలను తానే పూడ్చిపెట్టానని ప్రకటించుకున్న ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు, ముసుగు వ్యక్తి భీమాను తాజాగా సిట్ అధికారులు అరెస్టు చేశారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే.

ధర్మస్థల పరిసరాల్లో 100కు పైగా శవాలు పూడ్చిపెట్టానని చెప్పిన భీమా చివరకు వాటి ఆనవాళ్లు చూపకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిన్న రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది. దీంతో అతడిని అరెస్టు చేసింది. నేడు ముసుగు వ్యక్తిని కోర్టులో హాజరుపర్చనున్నారు.

ఇక, ఈ కేసులో తప్పుడు ఆరోపణలు చేసిన బెంగళూరు మహిళ సుజాత భట్‌ను కూడా పోలీసులు అరెస్టు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. వైద్య విద్య చదివే తన కుమార్తె అనన్య భట్ 2003లో ధర్మస్థల వెళ్లి అదృశ్యమైందంటూ ఆమె ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే, అదంతా కట్టుకథేనని తాజాగా ఆమె పేర్కొన్నారు. దీంతో ఆమె ఇంటికి పోలీసులు శనివారం వెళ్లారు. విచారణ అనంతరం ఆమెను అదుపులోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

**ఏంటీ కేసు వివాదం..**

దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నట్లు పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని, చేసిన తప్పు వెంటాడటంతో ఇప్పుడు బయటకు వచ్చి ఫిర్యాదు చేశానని అతడు చెప్పాడు.

దీంతో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సిట్ ఏర్పాటుచేసింది. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం.. పారిశుద్ధ్య కార్మికుడు చెప్పినచోట తవ్వకాలు జరపగా కొన్ని కళేబరాలు బయటపడ్డాయి. ఈ క్రమంలోనే ఇటీవల అతడు మాట మార్చి ట్విస్ట్ ఇచ్చాడు. 'నాకు ఒకరు పుర్రెను ఇచ్చి సిట్ అధికారులకు ఇవ్వాలని సూచించారు. న్యాయస్థానంలో అర్జీ కూడా వారే వేయించారు. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉంటున్నా' అని తెలిపాడు. దీంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ నేపథ్యంలోనే అతడిని విచారించిన దర్యాప్తు బృందం.. తాజాగా అరెస్టు చేసింది.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి

**మంత్రి పొన్నం**

జనం పవర్, హైదరాబాద్ :

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో 6 వేల కొత్త రేషన్‌కార్డులు ఇచ్చినట్లు గుర్తించారు. అధికార పార్టీకి అవకాశమిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రతి బూత్‌కు ఒకరు ఇన్‌ఛార్జిగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఎక్కడా ఉండకూడదని సూచించారు. నియోజకవర్గంలోని 7 డివిజన్లలో ఇన్‌ఛార్జి ఉపాధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు ప్రభావవంతంగా పని చేయాలని తెలిపారు. డివిజన్లలో కార్యాలయాలు ప్రారంభించుకోవాలని.. బూత్‌వారీగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రభుత్వ పథకాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ పాల్గొన్నారు.

# వాటర్ బాటిల్‌కు వంద రూపాయలా?

**దాని ఎమ్మార్పీ ధర ఇరవై రూపాయలే కదా..**

**మీరు 80 రూపాయలు ఎక్కువ ఎందుకు వసూలు చేస్తున్నారు?**

**రెస్టారెంట్లను ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు**

**సర్వీస్ చార్జీలు వేయడంపై తీవ్ర ఆగ్రహం**

జనం పవర్, హైదరాబాద్ :




హోటళ్లు, రెస్టారంట్లు ఆహార బిల్లులలో సర్వీస్ ఛార్జీలను కలిపి తీసుకోవడంపై ఢిల్లీ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేస్తున్నప్పుడు.. మళ్లీ కస్టమర్లపై సర్వీసు ఛార్జీల మోత ఎందుకని ప్రశ్నించింది. హోటళ్లు, రెస్టారంట్లలో సర్వీస్ ఛార్జీలు తప్పనిసరి కాదంటూ ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం తీర్పు వెలువరించింది. దీన్ని సవాల్ చేస్తూ నేషనల్ రెస్టారంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ హోటల్స్ అండ్ రెస్టారంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్.. హోటళ్లు, రెస్టారంట్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది.

'రెస్టారంట్లు తమవద్దకు వచ్చే కస్టమర్లపై మూడు విధాలుగా ఛార్జీలు వసూలుచేస్తున్నాయి. ఆహార పదార్థాలు విక్రయించడం, వాటిని సర్వ్ చేయడం, ఆహ్లాదకర వాతావరణం అందిస్తున్నందుకు ఛార్జీలు విధిస్తున్నాయి. ఇప్పటికే మీరు (రెస్టారంట్లు) ఆహ్లాదకర వాతావరణం అందిస్తున్నామన్న కారణంతో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు. అలాంటప్పుడు మళ్లీ సేవల కోసం సర్వీస్ ఛార్జీలు ఎలా తీసుకుంటారు? ఉదాహరణకు రూ.20 వాటర్ బాటిల్ ధర రెస్టారంట్లలో రూ.100 వసూలు చేస్తున్నారు. అప్పుడు కస్టమర్ మళ్లీ ఎందుకు సర్వీస్ ఛార్జ్‌ను కట్టాలి? రూ.20 ధర ఉన్న వాటర్ బాటిల్‌ను మెనూలో రూ.100గా పేర్కొన్నప్పుడు అదనంగా వసూలుచేస్తున్న రూ.80 ఎందుకో చెబుతున్నారా?'' అని హైకోర్టు డివిజన్ బెంచ్ మండిపడింది.

హోటళ్లు, రెస్టారంట్లు బిల్లులలో సర్వీస్ ఛార్జీలు వసూలుచేయడాన్ని నిషేధిస్తూ వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ (CCPA) గతంలో చేసిన మార్గదర్శకాలను సవాలు చేస్తూ పలు రెస్టారంట్ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లను మార్చిలో కోర్టు కొట్టేసింది. సర్వీస్ ఛార్జీలను వినియోగదారులు కచ్చితంగా చెల్లించేలా బిల్లులో వాటిని కలిపి ఇవ్వడం వారి హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. సర్వీస్ ఛార్జీలు చెల్లించాలా.. వద్దా..? అనే విషయాన్ని కస్టమర్ల విచక్షణకే వదిలేయాలని సూచించింది. ఈవిధంగా వినియోగదారులపై అదనపు ఛార్జీలను విధించే రెస్టారంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థకు సూచించింది.

కొన్నిరకాల హోటళ్లు, రెస్టారంట్లలో వసూలుచేస్తున్న సర్వీస్ ఛార్జీలు.. పన్నుల కిందికి రావని కేంద్ర ప్రభుత్వం 2017లో ప్రకటించింది. వీటిని సేవా పన్నుగా పరిగణించడం పొరపాటేనని తెలిపింది. వాటి చెల్లింపులను వినియోగదారుడి అంగీకారానికే వదిలేస్తున్నట్లు అన్ని హోటళ్లలో బోర్డు ప్రదర్శించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. మార్గదర్శకాల ప్రకారం బిల్లులో సేవా రుసుము కాలమ్‌ను ఖాళీగా వదిలేయాలి. అయినప్పటికీ హోటళ్లు కస్టమర్లపై ఇష్టారాజ్యంగా సర్వీస్ ఛార్జీలు విధిస్తున్నాయి.

# సురవరం సుధాకర్ రెడ్డికి పలువురి నివాళి

**పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులు**

**అభిమానుల సందర్శనార్థం నేడు హిమాయత్ నగర్ ఆఫీసులో..**



జనం పవర్, హైదరాబాద్ :

గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో ఉన్న సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత సహా పలువురు పార్టీ నాయకులు, సీపీఎం నేతలు నివాళులర్పించారు. అభిమానుల సందర్శనార్థం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సురవరం భౌతిక కాయాన్ని ఉంచనున్నారు. అనంతరం పార్థివ దేహాన్ని గాంధీ ఆస్పత్రికి అప్పగించనున్నారు. సురవరం నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందజేయనున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సురవరం కన్నుమూసిన సంగతి తెలిసిందే. వయోభారానికి తోడు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

సురవరం సుధాకర్ రెడ్డి మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికుల పక్షాన బలంగా సురవరం తన గళం వినిపించారని అన్నారు. నల్గొండ ప్రాంతంలో ఫ్లోరోసిస్, కరవు పరిస్థితులపై పోరాటాలు చేపట్టినట్లు గుర్తు చేసుకుంటూ.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# యూరియా కోసం రైతులు ఆందోళన అవసరం లేదు

**ఎమ్మెల్యే విజయ రమణారావు భరోసా**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 23:**

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సుల్తానాబాద్ మండల సింగిల్ విండో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని, వర్షాకాల పంటలకు అవసరమైన ఎరువును ప్రభుత్వం పకడ్బందీగా సరఫరా చేస్తోందని తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో సింగిల్ విండో ఫర్టిలైజర్ కేంద్రాల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియాను అందిస్తున్నామని, ఇప్పటికే 21,581 మెట్రిక్ టన్నుల యూరియా మార్కెట్లో ఉందని, రైతులు 6570 శాతం వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మొత్తం జిల్లాలో 2.76 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, నెలవారీగా సరఫరా జరుగుతుందని వివరించారు. ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా అరికట్టేందుకు నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ 78 రోజులుగా మూతపడి ఉండటంతో తెలంగాణకు నష్టం జరుగుతోందని, ఈ విషయంలో ఎంపీలు అడిగినా స్పందన లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కేంద్రానికి యూరియా ఇవ్వాలని కోరినా స్పందించకపోవడం హాస్యాస్పదమని, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు రైతులను తప్పుదోవ పట్టించేలా అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. యూరియా కొరతను కృత్రిమంగా సృష్టిస్తున్నది బీఆర్ఎస్ నాయకులేనని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసిన నిరసనకు ప్రియాంకా గాంధీ మద్దతు పలకడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్కాలర్షిప్,ఫీజు రీయంబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయాలి

*** ఎస్ఎఫ్ఐ డిమాండ్**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 23:**




పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్మెంట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫీజు దీక్ష కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ ప్రారంభించగా, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ జి.జ్యోతి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం అజాద్ తదితరులు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయాలని, పై చదువులకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బాలికల జూనియర్ కళాశాల కొత్త భవన నిర్మాణం, బాలికల ఎస్సీ, ఎస్సీ ఎంఎస్ కాలేజీ హాస్టల్ ఏర్పాటును తక్షణమే చేపట్టాలని కోరారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర నాయకులు శనగరపు రజనీకాంత్, తాళ్ల నాగరాజు దీక్షను విరమించగా, జిల్లా ఉపాధ్యక్షుడు బండెల రాజ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మామిడిపల్లి అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్నకొండ ఆదిత్య, నాయకులు అభి రాజశేఖర్, ఐశ్వర్య, అక్షయ, శిరీష, అక్షిత,సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల నియామకానికి వాక్-ఇన్ ఇంటర్వ్యూ నోటిఫికేషన్

**సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 23:**



పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి ఆగస్టు 29న ఉదయం 11 గంటలకు వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూల ద్వారా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో 2 సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌లు (ఒకరు గైనకాలజిస్ట్, మరొకరు ఆర్థోపెడిక్స్), మంథని సామాజిక ఆసుపత్రిలో ఒక గైనకాలజిస్ట్, సుల్తానాబాద్‌లో ఒక పిడియాట్రీషియన్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ఆయన వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు, బయోడేటా, విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు వాటి జిరాక్స్ ప్రతులు ఒక సెట్‌తో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నెలకు లక్ష రూపాయల వేతనం చెల్లించబడుతుందని, పూర్తి వివరాల కోసం 8499061999, 9491481481 నంబర్లను సంప్రదించవచ్చని డాక్టర్ శ్రీధర్ తెలిపారు.

# రామగుండం అభివృద్ధే రాజ్ ఠాకూర్ లక్ష్యం

*** మనాలి ఠాకూర్**

**జనం పవర్,రామగుండం ఆగస్టు 23:**



రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు గోదావరిఖని డైలీ మార్కెట్ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, TUFIDC నిధుల ద్వారా రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులను తాను మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తిప్పరపు శ్రీనివాస్‌తో పాటు స్థానిక నాయకులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని, గోదావరిఖని మార్కెట్‌ను ఆధునిక వసతులతో తీర్చిదిద్దడం తమ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగమయ్యారు.

# యూరియాపై ఆందోళన వద్దు

**రాష్ట్రానికి సరఫరా పెంచేందుకు అన్ని రకాల చర్యలు**

**ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి పునరుద్ధరణపై మార్గనిర్దేశం**

**సచివాలయంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు సమీక్ష**

**జనం పవర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఆగస్టు 23**




రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్సీఎల్) యాజమాన్యం, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో శనివారం సాయంత్రం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సీజన్ లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పనిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్ఎఫ్సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్ ను ప్రశ్నించారు. మిమ్మల్ని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదని, రాష్ట్రాభివృద్ధిలో మాతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్ ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దన్నారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్ఎఫ్సీఎల్ మాతృ సంస్థ ఎన్ఎఫ్ఎల్ కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతి రోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో మీకేమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్ఎఫ్సీఎల్ రామగుండం యూనిట్ హెడ్, జీఎం రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# రామగిరి మండలంలో పంచాయతీ వ్యవహారాలపై సమీక్షా సమావేశం



**జనం పవర్,రామగిరి ఆగస్టు 23:**

రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లు, ఇంటి పన్ను గణన మరియు చెల్లింపు విధానం, ఓటర్ల జాబితా సిద్ధం, రహదారుల వెంట మొక్కల నాటకం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజా రాణి, ఎంఈఓ ఉమేష్‌కుమార్ యాదవ్, సోలార్ ప్యానల్ పీఎం విశ్వకర్మ, పంచాయతీ కార్యదర్శులు మరియు పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# నేరాలపై ఉక్కుపాదం

**గంజాయి, సైబర్ క్రైమ్ నియంత్రణకు ప్రత్యేక దృష్టి"**

**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 23:**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై నెల నేరాల సమీక్షా సమావేశం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఆధ్వర్యంలో జరిగింది .ఈ సమావేశంలో పెద్దపల్లి,మంచిర్యాల జోన్ డిసిపీలు,ఏసిపీలు,సీఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.నేరాల నియంత్రణ,పెండింగ్ కేసుల దర్యాప్తు,సాక్ష్యాధారాల సేకరణ,చార్జ్‌షీట్‌ల పురోగతిపై పోలీస్ కమిషనర్ విపులంగా సమీక్షించారు.ముఖ్యంగా మహిళలపై నేరాలు,ఆస్తి నేరాలు,పోక్సో,మిస్సింగ్,గంజాయి,రోడ్డు ప్రమాదాల కేసుల్లో పారదర్శకంగా,వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు కోర్టులో శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.నేరాల నియంత్రణలో శాస్త్రీయ పద్ధతులు,ఆధునిక టెక్నాలజీని వినియోగించాలని,పదేపదే నేరాలకు పాల్పడిన వారిపై "గ్యాంగ్ ఫైల్స్" ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతం పెంచడంతో పాటు ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని,రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ విభాగంతో సమన్వయం చేసుకుని ప్రమాదాలపై విశ్లేషణ చేసి ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ట్రాఫిక్ ఉల్లంఘనలపై కాంటాక్ట్,నాన్ కాంటాక్ట్ చాలన్లు విధించాలని ఆయన సూచించారు.సైబర్ క్రైమ్‌ల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేసిన సీపీ, ప్రజల్లో అవగాహన పెంచుతూ అధికారులు నేరాల నివారణకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.గంజాయి అక్రమ రవాణా,నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టి నిందితులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలని,చట్ట విరుద్ధ కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా సాగేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని,మండపాల్లో డీజేలకు అనుమతి లేదని,నిర్వాహకుల బాధ్యతతో పాటు భద్రతా చర్యలు కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు.సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు,కీలక ప్రదేశాల్లో పికెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినా,పంపినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని,ఇందుకోసం ప్రత్యేక సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ ఏడాదిలో గంజాయి నియంత్రణలో భాగంగా పెద్దపల్లి జోన్‌లో 34 కేసుల్లో 98 మందిని అరెస్ట్ చేసి 157.102 కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా,మంచిర్యాల జోన్‌లో 34 కేసుల్లో 98 మందిని అరెస్ట్ చేసి 34.541 కిలోల గంజాయి స్వాధీనం చేసినట్టు వివరించారు.ఈ కేసుల్లో కృషి చేసిన అధికారులకు క్యాష్ రివార్డులు అందజేశారు.విధుల్లో అలసత్వం ప్రదర్శించి శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.పోలీస్ అధికారుల పనితీరుపైనే కమిషనరేట్ ప్రతిష్ఠ ఆధారపడి ఉంటుందని సీపీ స్పష్టం చేశారు.

# జగిత్యాల ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 23**



జగిత్యాల పట్టణ చింతకుంట చెరువు వద్ద నిజామాబాద్ రోడ్డు నుండి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు 15 లక్షలు CC రోడ్డు నిర్మాణానికి జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం మడేలేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ ని రజక సంఘం కార్యవర్గ సభ్యులు సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా జగిత్యాల పట్టణ అభివృద్ధి జరుగుతుందని అన్నారు, ఎఫ్టిఎల్. బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టరాదని. అవి ఎన్నో ఏళ్లుగా ఉన్న చట్టాలున్నాయని అన్నారు. గతంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల అనుమతి లేకుండా నిర్మాణాలు జరుగాయని అన్నారు. మోతే చెరువు శుద్ధికి 3.5 కోట్లు, కండ్లపల్లి చెరువు శుద్ధికి 3.5 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. 6 కోట్ల తో అడ్వాన్స్డ్ టెక్నికల్ సెంటర్ నిర్మాణం దాదాపు పూర్తి అయిందన్నారు. 5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణంలో ఉందన్నారు. బీట్ బజార్లో వెజ్ నా వేజ్ మార్కెట్ వచ్చే వారం ప్రారంభోత్సవం కానుందన్నారు. గాంధీనగర్ లో రోడ్డు ప్రమాదాలు నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా 18 కోట్లతో 4 వరుసల బ్లాక్ స్పాట్ రోడ్డు వేయటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరి వారి మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవించాలన్నారు. పట్టణం పరిసరాలు కలపడంతో పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతతో చేయాలన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీస్ లు ఇవ్వాలన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి శ్రీనివాస్, బాలే శంకర్, సమీండ్ల శ్రీనివాస్, పంబల రామ్ కుమార్, పద్మావతి పవన్, డిష్ జగన్, జంబర్తి రాజ్ కుమార్, బోడ్ల జగదీష్, రామ్మోహన్ రావు, చందా పృథ్వీ, కూతురు రాజేష్, దుమాల రాజ్ కుమార్, కొలగాని సత్యం, కోరే గంగమల్లు, జంబర్తి శంకర్, శరత్ రావు, పెద్దింటి రాజు, అహమ్మద్, గట్టు రాజు, ప్రవీణ్ రావు, పుల్ల మల్లయ్య, వెంకన్న,గౌస్, నక్క గంగాధర్, క్రాంతి, శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షుడు రవి, ఉప అధ్యక్షులు రమేష్, కోశాధికారి చుక్క మహేష్, ఏఓ శ్రీనివాస్, ఏఈ శరన్, టిపిబిఓ శ్రీకర్, టిఎంసీ రజిత, నాయకులు, అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారం కోసం ధర్నా




**జనం పవర్ జగిత్యాల ఆగస్టు 23:**

జగిత్యాల జిల్లా కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమ సాంకేతిక సమస్యలు, ప్రభుత్వ హామీల అమలు కోరుతూ శనివారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సరైన ఫోన్లు లేక లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్, ఎఫ్ఆర్ఎస్ నమోదు జరగకపోవడంతో అధికారులు ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలను నాలుగవ సంవత్సరం నుండి పాఠశాలల్లో చేర్పించే నిర్ణయాన్ని, జీరో నుండి మూడు సంవత్సరాల పిల్లల సేవలను కొనియాడారు.

# కమాన్‌పూర్ శ్రీ ఆది వరహాస్వామి ఆలయాన్ని దర్శించిన జిల్లా జడ్జి

**జనం పవర్,కమాన్‌పూర్ ఆగస్టు 23:**



కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆది వరహాస్వామి దేవాలయాన్ని శనివారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచల దర్శించారు. ఆలయ ఈవో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికగా, అనంతరం ఆమె స్వామివారి అభిషేకంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఆరాధన చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదం సమర్పించారు. ఈ సందర్భంగా జడ్జి సునీత కుంచల మాట్లాడుతూ, స్వయంభుగా వెలసిన ఆది వరహాస్వామి ఆలయం భక్తుల మనోభిలాషలు తీర్చే మహిమాన్విత క్షేత్రమని పేర్కొన్నారు. ఇలాంటి దివ్యస్థలాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భక్తులందరూ ఈ పవిత్ర క్షేత్రాన్ని దర్శించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆమె ఆకాంక్షించారు.

# కామ్రేడ్ సుధాకర్ రెడ్డి మృతి



## ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 23:**

సిపిఐ మాజీ కేంద్ర ప్రధాన కార్యదర్శి,నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని రైతుకూలీ సంఘం,అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య,శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం,అరుణోదయ కమిటీ,స్త్రీ విముక్తి కమిటీలు తమ విప్లవ జోహార్లు అర్పించాయి.దేశంలో పెరుగుతున్న పాసిజానికి వ్యతిరేకంగా విప్లవ శక్తుల ఐక్యత కొనసాగుతున్న ఈ సమయంలో సుధాకర్ రెడ్డి మరణం అత్యంత బాధాకరమని పేర్కొంటూ,ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని స్పష్టం చేశాయి.సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు, సిపిఐ శ్రేణులందరికీ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం,అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు టి.రత్నకుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి రాయమల్లు,శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాములు,అరుణోదయ నాయకుడు చి.యాకూబ్,స్త్రీ విముక్తి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బి.మణెక్కా సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

# ప్రగతి హైస్కూల్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు

**జనం పవర్,రామగిరి ఆగస్టు 23:**



రామగుండం సీపీ ఆదేశాల మేరకు రామగిరి,సెంటినరీ కాలనీ,కల్వచర్లలోని ప్రగతి హైస్కూల్‌లో విద్యార్థులకు షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత,ఆన్లైన్ మోసాలు,యాంటీ డ్రగ్స్‌తో పాటు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా లేదా మాట్లాడినా తల్లిదండ్రులకు చెప్పాలని,వాటి నుంచి ఎలా బయటపడాలో సూచించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్‌లు, ప్రధాన చౌరస్తాలు,కాలేజీల వద్ద ప్రతిరోజూ షీ టీమ్ మోహరించబడుతుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని,ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.అలాగే అత్యాశకు లోనై సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు,లోన్ యాప్‌లకు బలి కాకుండా అప్రమత్తంగా ఉండాలని,ఎవరికైనా మోసం జరిగితే 1930 హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని,అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు మౌనిక,సురేష్,హెడ్‌మాస్టర్ కేశవరెడ్డి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# జనహిత పాదయాత్రకు భారీ ఏర్పాట్లు



## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**జనం పవర్ గంగాధర, ఆగస్టు 23:**

జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. ఈనెల 24వ తేదీన గంగాధర మండలంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొనే జనహిత పాదయాత్రను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉప్పరమల్యాల నుండి మధురానగర్ చౌరస్తా వరకు సుమారు 6 వేల మంది కార్యకర్తలు, ప్రజలతో పాదయాత్రను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర మార్గాన్ని, మధురానగర్ చౌరస్తాలో జరిగే రోడ్ షో ఏర్పాట్లను ఎమ్మెల్యే సత్యం పరిశీలించారు. మధురానగర్ చౌరస్తాలో జరిగే రోడ్ షోలో మీనాక్షి నటరాజన్‌తో పాటు మంత్రులు ప్రసంగించనున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మధురానగర్ చౌరస్తాలోని దళిత కార్యకర్త మ్యాక్ వినోద్ గృహంలో రాత్రి విశ్రాంతి తీసుకోనున్నారని పేర్కొన్నారు. పాదయాత్రను విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలకు భద్రత ఏర్పాట్లు

**జాతీయ మెగా లోక్ ఆధాలత్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 23**



శనివారం రోజు ఏర్పాటు చేసిన నేర సమీక్ష కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల పై పోలీస్ అధికారులు తీసుకొన్న ప్రత్యేక చొరవతో పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించారని అన్నారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అవసమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను, నిఘా వ్యవస్థను పటిష్ట పరచాలని సూచించారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తుల పై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరుగు ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో తీసుకున్న చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నివారించినట్టు గుర్తు చేశారు. సెప్టెంబర్ 13 న జరిగే జాతీయ మెగా లోక్ ఆధాలత్ ని ప్రజలు సద్వినియోగం చేసుకునేల అవగాహన కల్పించాలని, గుర్తించిన పెండింగ్ కేసులల్లో అన్ని పరిష్కరమయ్యే విధంగా ప్రతి అధికారి కృషి చేయలని సూచించారు.

**గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేయాలి**

27 వ తేదీన ప్రారంభంకానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వేడుకలను ప్రజలు శాంతియుతంగా, ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడ శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. డయల్ 100 కు వచ్చే కాల్స్ ను ప్రత్యేక శ్రద్ధతో పరిగణించాలన్నారు. సీసీటీవీలపై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న గణేష్ మండపం నిర్వాహకుల కమిటీ వివరాలు తీసుకోవాలని సూచించారు. వినాయక మండపాల దగ్గర ఎటువంటి సమస్యలు, ఘర్షణలు లేకుండా చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాలు వుంటే బందోబస్తును పెంచాలని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ శోభయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పటిష్టమైన పోలీసులతో బందోబస్తు, నిమజ్జనోత్సవానికి అవసరమైన స్విమర్స్, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత శాఖల సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

**డిజేలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదు. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా**

గణేష్ మండపాల వద్ద, శోభాయాత్రలో నిబంధనలు విరుద్ధంగా డిజేలు, అధిక శబ్దాలు చేసే సౌండ్ సిస్టం లపై పూర్తి స్థాయిలో నిషేధం ఉందని, నిబంధనలు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే డిజే యజమానులతో పాటు మండపాల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, ప్రజా జీవనానికి భంగం కలిగిస్తూ తరచూ గొడవలకు పాల్పడే వారిని సంబంధిత తహసిల్దార్ల ముందు బైండోవర్ చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై, వాస్తవాలను తెలుసుకోకుండా అట్టి పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ యొక్క సమావేశంలో డిఎస్పీలు వెంకటరమణ, రఘు చంధర్, రాములు, వెంకట రమణ. ఐటి కోర్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీఖాన్, రఫీక్ ఖాన్, శ్రీనివాస్ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, కిరణ్ కుమార్ ,వేణు. సి.ఐలు సుధాకర్ , కరుణాకర్ ,రామ్ నరసింహారెడ్డి, సురేష్ , అనిల్ కుమార్. ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బి ఆర్ ఎస్ లు దొందూ దొందే



**ఆ రెండు పార్టీలు అవిభక్త కవలలు**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం**

**జనం పవర్.జగిత్యాల.ఆగష్టు 23**

ఉప రాష్ట్రపతి ఎన్నికల వేళ బిజెపి బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నేతలు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం విమర్శించారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో కేంద్రంలో అధికారాన్ని పంచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. 2009లో బీజేపిని ఓడించడానికి మహాకూటమి పేరుతో కాంగ్రెస్, తెలుగుదేశం, బిఆర్ఎస్, కమ్యూనిస్టులు పొత్తుపెట్టున్న కాంగ్రెస్ పార్టీకి బీజేపిని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. గతంలో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ పార్టీ ఒక గిరిజన ఆడబిడ్డకు మద్దతునిస్తే కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీలు కలిసి యశ్వంత్ సిన్హాను పోటీలో దింపి మద్దతు తెలిపి ఒక్కతాను ముక్కలు అని నిరూపించుకున్నాయని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓటుకు నోటు కేసులో కాపాడితే కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ను ఫోన్ ట్యాపింగ్ కేసులో కాపడానికి ప్రయత్నం చేస్తోందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమ్ముడు పోయారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంతల్లో పశువుల్లాగా అమ్ముడుపోతున్నారని అలాంటప్పుడు బిజెపి బిఆర్ఎస్ పార్టీలు రెండు ఎలా ఒక్కటి అవుతాయని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒకే భావ సారూప్యత కలిగిన పార్టీలని అవిభక్త కవలలు అని వాటి మధ్య విడదీయరాని సంబంధం ఉందని ఎద్దేవా చేశారు. నైతిక విలువలతో కూడిన రాజకీయాలకు బిజెపి నిలువెత్తు నిదర్శనమని అందుకు గతంలో ఈటెల రాజేందర్, కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిలు వారి వారి పార్టీలకు రాజీనామా చేశాకే బిజెపిలో చేర్చుకున్న విషయం కాంగ్రెస్ నాయకులు గుర్తెగాలి అన్నారు. ఈసమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి. మాజీ అధ్యక్షుడు గంగుల కొమురెల్లి. ప్రధాన కార్యదర్శి తోడేటి గట్టయ్య. ఉపాధ్యక్షులు వరద రాము. బిజెవైఎం మండల అధ్యక్షుడు జక్కుల హరీష్. తదితరులు పాల్గొన్నారు..

# పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**సీపీ అంబర్ కిశోర్ ఝా**

**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 23:**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు,మిలాద్‌ఉన్‌నబీ పండుగలు ప్రశాంత వాతావరణంలో,మతసామరస్యానికి ప్రతీకగా సాఫీగా సాగేందుకు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో క్వార్టర్స్‌లో అన్ని మతాల పెద్దలు,గణపతి మండప నిర్వాహకులు,హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి పండుగను శాంతియుత వాతావరణంలో జరపాలని ,సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు లోనుకాకూడదని హెచ్చరించారు.గత సంవత్సరం 4786 వినాయక విగ్రహాలు ఏర్పాటు కాగా,ఈసారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు.ప్రతి మండప నిర్వాహకుడు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకుని అనుమతి తీసుకోవాలని,విగ్రహాలకు జియోట్యాగింగ్,నిమజ్జనానికి రూట్ మ్యాప్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచాలని,24 గంటల పహారా తప్పనిసరి అని స్పష్టం చేశారు.లక్కీ డ్రాలు,జూదం,బలవంతపు చందాలు,మద్యం సేవించి రావడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు.విద్యుత్ కనెక్షన్లు తప్పనిసరిగా అధికార అనుమతులతోనే ఏర్పాటు చేయాలని,నాణ్యమైన పరికరాలు వినియోగించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేసి మత ఘర్షణలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పండుగల సమయంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా ,నిమజ్జన యాత్రలు సాఫీగా సాగేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.శోభాయాత్ర సమయంలో పోలీస్ శాఖ రూపొందించిన రూట్ మ్యాప్‌ను ఖచ్చితంగా పాటించాలని,శాంతి కమిటీ సభ్యులు పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో డీసీపీలు,ఏసీపీలు,సీఐలు,వివిధ వింగ్స్ అధికారులు,పీస్ కమిటీ సభ్యులు,మత పెద్దలు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**మేకల ప్రభాకర్ యాదవ్***

**జనం పవర్ గంగాధర, ఆగస్టు 23:**



గంగాధర మండలం మధురనగర్ గ్రామంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు *మేకల ప్రభాకర్ యాదవ్* హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 6 గ్యారంటీల పేరిట 420 హామీలు ఇచ్చి రైతులను, మహిళలను, యువతను పూర్తిగా నిరాశపరిచిందని తెలిపారు.

రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, వృద్ధులకు రూ.4000 పెన్షన్, ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం, కౌలు రైతులకు రైతు భరోసా వంటి హామీలను ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన అన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే గ్రామాల్లో జరుగుతున్న పనులు కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారానే జరుగుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ ఒక్క పైసా కూడా కేటాయించలేదని ఆరోపించారు.

రేపు గంగాధర మండలంలో జరుగబోయే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ముందుగా చెప్పాలని, హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేసిన తర్వాతే పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు, మహిళలు, యువత పాదయాత్రను అడ్డుకుంటారని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెప్పిన హామీలను కూడా అమలు చేయలేదని, నారాయణపూర్ నిర్వాసితులు, డిగ్రీ కళాశాల ఏర్పాటు వంటి వాగ్దానాలు మాటలకే పరిమితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. గతంలో టీఆర్ఎస్ రైతుల సమస్యలు పరిష్కరించకపోవడంతో ఆత్మహత్యలు జరిగిన రోజుల్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలూ ప్రజలను మోసం చేశాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు కూడా గుణపాఠం చెప్తారని మేకల ప్రభాకర్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వైద రామానుజం, మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్, మోడీ రవీందర్, గాజుల మల్లేశం, బండ నరసింహారెడ్డి, ఎడెల్లి పరుశురాం, చిల్ల శ్రవణ్, మహేష్, మాజీ మండల అధ్యక్షులు కోల అశోక్, ఎడవెల్లి శశిధర్ రెడ్డి, తుమ్ నారాయణ, సదాల భాస్కర్, శ్రీపతి రాజేంద్రప్రసాద్, మల్యాల వినయ్ సాగర్, సుద్దాల రవీందర్ రెడ్డి, పెంచాల రాములు, గాలిపల్లి శ్రీనివాస్, మోతే నరసింహారెడ్డి, పోచంపల్లి నరేష్, శ్రీకాంత్, రేండ్ల శ్రీనివాస్, వోడ్నాల రాజు, బొమ్మకంటి రాజిరెడ్డి, తాళ్ల రాజశేఖర్, విజయేందర్ రెడ్డి, దేశెట్టి శ్రీనివాస్, పెరుక శంకర్, అనిల్, వేముల గంగయ్య తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పించాలి

**సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాసరావు**




**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 23:** ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పించి,పారదర్శక పాలన అందించేలా చేయడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాసరావుఅన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం-2005పై పిఐఓలు, ఏపీఐఓలకు నిర్వహించిన అవగాహన సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, వైష్ణవిమేర్ల హాజరయ్యారు. జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న సమాచార కమిషనర్లకు అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య పూల మొక్కలను బహుకరించి స్వాగతం పలికారు. అనంతరం వారు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సులో కమిషనర్ పీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పించి, పారదర్శక పాలన అందించేలా చేయడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పౌర సమాజంలో అనేక వ్యక్తుల ఆలోచనల నుంచి పుట్టిందే ఈ సమాచార హక్కు చట్టం అని తెలిపారు. పి ఐ ఓ లు, ఏపీఐవోలు సమాచార హక్కు చట్టం అంటే తప్పించుకునే ధోరణిని వదిలేసి, ఈ చట్టాన్ని అర్థం చేసుకొని నిర్దిష్టంగా అమలు చేసి దేశంలోనే ఆర్టిఐ దరఖాస్తుల పరిష్కారంలో రాష్ట్రాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేలా చేయాలని సూచించారు. పిఐఓ స్థాయిలో దరఖాస్తులను పరిష్కరిస్తే పైస్థాయికి వచ్చే అవకాశం ఉండదని, తద్వారా పెండింగ్ దరఖాస్తులు ఉండే అవకాశం కూడా ఉండదని చెప్పారు. గత మూడున్నర ఎళ్ళుగా సమాచార కమిషనర్ల నియామకం లేకపోవడంతో చాలా అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఈ జిల్లాల పర్యటన ద్వారా అందరికీ అవగాహన కల్పించి, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బోరెడ్డి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పథకాలను సక్రమంగా అమలు చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంలో సమాచార హక్కు చట్టం పాత్ర కీలకమని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వాసాన్ని కలుగ జేస్తుందని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు. ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డు,అందులో పి ఐ ఓ, ఏపీఐవో వివరాలు, అదేవిధంగా ప్రభుత్వ అధికారుల బాధ్యతలను తెలియజేసే4(1)(బీ) తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేస్తే వారికి మీ పట్ల ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరుగుతుందని తెలియజేశారు. వైష్ణవి మెర్ల మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని సకాలంలో అందజేయాల్సిన బాధ్యత పిఐఓల పైన ఉందని గుర్తు చేశారు. మొదటి 30 రోజుల్లో వారికి తప్పనిసరిగా రిప్లై ఇవ్వాలని ఆమె గుర్తు చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్లో ఉన్న ప్రతి సమాచార హక్కు దర ఖాస్తును పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులకు సమాచారం ఇవ్వగలిగేలా ఉన్నప్పటికీ కొందరు ఇతరులకు బదిలీ చేస్తున్నారని, అలా అనవసరంగా బదిలీ చేయవద్దని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ సమాచార హక్కు చట్టానికి సంబంధించి వస్తున్న దరఖాస్తులను పరిష్కరించడంలో కమిషనర్లు సూచించిన ప్రకారం అనుసరించి దరఖాస్తులను పిఐఓ స్థాయిలోనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అన్ని జిల్లా శాఖల అధికారులు, పిఐఓలు ఏపీఐవోలు, తదితరులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన పాత్రికేయులుగా రాణించాలి



**జనం పవర్, జమ్మికుంట ఆగస్టు 23:** శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో, శనివారం జర్నలిజం సర్టిఫికెట్ కోర్స్ వీడ్కోలు కార్యక్రమం, సర్టిఫికెట్స్ ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, పాత్రికేయులు అన్నవరం దేవేందర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జర్నలిజం సాహసంతో కూడుకున్న వృత్తి అని దానికి పరి శీలన, పరిశోధన, వాస్తవికత, నిష్పాక్షికత ఆభరణాలని అన్నారు. పాత్రికేయ విలువలను పెంచేవిధంగా వృత్తి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్యకలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిజం చక్కటిప్రణాళికతో కూడుకున్నదన్నారు. శీర్షిక నుండి మొదలుకొని ప్రతి అక్షరం, పదం, వాక్యం సమాజపు మేలునుకోరే విధంగా ఉండాలన్నారు. వార్తలు సంచలనాలకన్నా ప్రధానంగా సందర్భ శుద్ధితో కూడి ఉండాలని సూచించారు. తెలుగు విభాగ అధ్యక్షులు డాబూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ పాత్రికేయ వృత్తి పరమ పవిత్ర మయిందని దాన్నిప్రజల క్షేమంకోసం వాడుకోవాలని అన్నారు. అనంతరం ముఖ్య అతిథి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధ్యాపకులు బూర్ల వేంకటేశ్వర్లు, డా. డి ప్రకాష్, డాక్టర్ ఆర్ శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా. పాత అశోక్, డా. పి. చైతన్య, డా. టి. భోజన్న, డా. పి. అనిల్, పి.శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

**పెద్దమందడి ఎస్సై శివకుమార్**

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 23:** పెద్దమందడి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని వినాయక చవితి సందర్భంగా గణేష్ ఏర్పాటు మండపాలకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తీసుకోకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.గణేష్ మండపాలకు మీ సేవ ద్వారా గణేష్ చతుర్థి ఆన్లైన్ లింకు నందు కుడా తప్పకుండా అనుమతి కోసం అప్లై చేసుకోవాలి అన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద గాని, నిమజ్జన ఊరేగింపు రోజు గాని డీజే లకు అనుమతి లేదన్నారు. మండపాల వద్ద ఊరేగింపులో ఇతరులను కించపరిచే లేదా రెచ్చగొట్టే విధంగా పాటలు పెట్టిన లేక ఇతర కార్యక్రమాలు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ శాఖ నియమ నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని, అదేవిధంగా డీజే వాహనాలు కుడా సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## మినీ ట్యాంక్ బండ్‌ను మరింత అభివృద్ధి చేస్తా

**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 23:** వనపర్తి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మినీ ట్యాంక్ బండ్ (నల్లచెరువు కట్ట)ను ఎంతో ఆహ్లాద భరితంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మినీ ట్యాంక్ బండ్‌పై 20 లక్షల రూపాయలవ్యయంతో నిర్మించనున్న మెయిన్ గేట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అధునాతనంగా నిర్మించే ఈ మెయిన్‌గేట్ నిర్మాణంతో ట్యాంక్ బండ్ ఎంత శోభాయమానంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్,జిల్లా యూత్ అధ్యక్షులువాకిటి ఆదిత్య, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మె న్ పాకనాటి కృష్ణయ్య, లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు కాం గ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే**

వాల్మీకి సంఘం మాజీ రాష్ట్ర నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త సింగోటం నాయుడు కుటుంబాన్ని మేఘారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సింగోటం నాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.వనపర్తి మున్సిపాలిటీలోకాంట్రాక్టర్‌గా పని చేసే వాడని, కుటుంబానికి ఉన్న పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబం ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకుస్పందించిన ఎమ్మెల్యే కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న తాను సహాయ సహకారాలు అందజేస్తారని వారికి భరోసా కల్పించారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**జడ్జి కె.స్వప్నరాణి**



**జనం పవర్,పెద్దపల్లి ఆగస్టు 23:** విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జి కె. స్వప్నరాణి అన్నారు. శనివారం సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తూ ఆమె మాట్లాడుతూ, ఉన్నత న్యాయస్థానాల మార్గదర్శకాల మేరకు అన్ని కోర్టుల్లో లీగల్ సర్వీసెస్ అథారిటీల ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి ఉచిత న్యాయం అందజేస్తున్నామని తెలిపారు. అన్యాయం జరిగిన వెంటనే లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదిస్తే తక్షణం సహాయం లభిస్తుందని చెప్పారు. యువతను చెడు వ్యసనాలకు అలవాటు చేసి దారి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, వాటికి దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. చదువుతూనే విజయాలు సాధించవచ్చని ప్రోత్సహించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, అలా జరిగి ప్రమాదం కలిగిస్తే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. వాహన చట్టం, సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ చట్టాలపై న్యాయ వాదులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు టి. నరేష్‌పటేల్, ఆర్.ఝాన్సీ, శరత్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా సదస్సు




**జనం పవర్, రామగుండం, ఆగస్టు 23:** గోదావరిఖనిలో ఈనెల 31న జరగను న్న కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) పెద్దపల్లి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమా వేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ, సహాయ కార్యదర్శి ఏ.వెంకన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యా యని విమర్శించారు. సింగరేణి, ఎన్‌టిపిసి, ఆర్ఎఫ్‌సి ఎల్, బసంత్‌నగర్ వంటి పరిశ్రమలతో పాటు వివిధ ప్ర భుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో 15% వాటా చెల్లించడంతో పాటు సిఎంపిఎఫ్ లెక్కలను తక్షణం ఆన్‌లైన్ చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే కార్మిక వర్గం పెద్దఎత్తున ఆందోళనకు దిగుతుందని హెచ్చరిస్తూ, జిల్లా సదస్సులో అన్ని రంగాల కార్మికులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఈ.నరేష్ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి బి.అశోక్, ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ



**జనం పవర్,హుజురాబాద్, ఆగస్టు 23:** హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ హుజురాబాద్ మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న 68మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయుటకు స్టీల్ ప్లేట్లను ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రతి సంవత్సరము విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ,పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు పంపిణీ, టాలెంట్ టెస్టులు నిర్వహించి నగదు ప్రోత్సాహాలు అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్ కిరణ్‌మై, సీఆర్పీ మాదం రవిబాబు, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, ఎం బిక్షపతి, భవాని,సహిదా సల్మా, సిహెచ్ సౌజన్య, యాసీన్ బేగం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రమాదేవి, రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ బాబు పాల్గొన్నారు

## సమాజ సేవ చేయడం ఒక గొప్ప వరం




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 23 :** సమాజ సేవ చేయడం ఒక గొప్ప సాహసం , అది ఒక వరం. ఇదే అంశంలో సతీష్ యాదవ్‌కి డాక్టరేట్ తెచ్చి పెట్టిందని, వివరించిన రావుస్, వాగ్దేవి కాలేజీల యాజమాన్యం చిన్ననాటి మిత్రబృందం. శనివారం వాగ్దేవి కాలేజ్, చిన్ననాటి స్నేహితులు, రావుస్‌కాలేజ్ యజమాన్యాలు డాక్టరేట్ తెచ్చుకున్న మాజీ కౌన్సిలర్ అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షునికి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తిలో సతీష్ యాదవ్ చేసిన సేవలు మర్చిపోలేనివని ఒకపక్క ప్రజా సేవ చేస్తూ మరొకపక్క ప్రజల అవసరాలు సమస్యలను పరిష్కరిస్తున్నాడని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్నాడు. మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవి కిరణ్, చందాపూర్ శ్రీకాంత్ యాదవ్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టెన్త్ క్లాస్ మెంట్స్, మిత్రులు, రావుస్ కాలేజ్, వాగ్దేవి జూనియర్ కాలేజ్, విజేత డిగ్రీ కాలేజ్ యజమాన్యాలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 23:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎస్వీఅర్ఎం డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకున్నారు. భారతదేశ అంతరిక్ష కేంద్రం ఇస్రో చంద్రయాన్-3, ఆగస్టు 23 - 2023న విజయవంతమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 23 రోజును జాతీయ అంతరిక్ష దినంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా అంతరిక్ష పరిశోధనల గురించి చక్కగా మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి నెల కళాశాలలో వివిధ అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రోగ్రాములు నిర్వహిస్తున్నామని అందుకు కళాశాల అధ్యాపకులచే కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మన దేశం అంతరిక్ష పరి శోధనలో దూసుకుపోతుందని గతంలో మనం ఇతర దేశాల సహకారంతో ఉపగ్రహాలు తయారు చేసే వారం కానీ ఇప్పుడు స్వదేశీ పరిజ్ఞానం వనరులతో మన శాస్త్రవేత్తలు ఉపగ్రహాలను తయారు చేస్తున్నారని దేశం సామాజిక, ఆర్థిక,సైనిక రంగాలలో పరిశోధనలతో బలపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజ్మెంట్ చాంద్ పాషా, చంద్రమౌళి, అధ్యాపకులు కల్పన, బుచ్చన్న, జైపాల్,కరుణాకర్ ,మోహన్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై ఆర్టీఐ కమిషన్ సభ్యులకు వినతి




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 23:** వనపర్తి పట్టణానికి రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచార హక్కు చట్ట ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించడం కోసం విచ్చేసిన సభ్యులకు పీవీ నరసింహారావు,బోరెడ్డి అయోధ్యరెడ్డి, వైష్ణవికి వనపర్తి జిల్లా సమాచార హక్కు చట్టం దరఖాస్తు దారుడు, గజరాజుల తిరుమలేష్, హెూవదేకర్ అభిలాష్ వినతి పత్రం అందజేశారు.జిల్లా కేంద్రంలోని అధికారులు, వనపర్తి మున్సిపాలిటీ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ప్రకారం అప్పిలేట్ అధికారులకు దరఖాస్తు చేసుకున్న అసంపూర్తి సమాచారం అందజేస్తున్నారు. దరఖాస్తు ఇచ్చిన 30 రోజుల్లో పూర్తి సమాచారం అందించడంలో సమయాన్ని వృధా చేస్తున్నారు. అసంపూర్తి సమాచారం ఇచ్చి తదితర విషయాలు మాపరిధిలో లేవంటూ అధికారులు సమాధానాలు తెలుపుతున్నారు.

# పట్టించుకోకుంటే పక్కదారులు

**- లేత వయసులో తప్పటడుగులు**

**- బాలల కదలికలపై పర్యవేక్షణ అవసరం**



**జనం పవర్, వేలేరు, ఆగస్టు 23:** ఏడో తరగతిలో గంజాయి అలవాటు అయ్యింది. ఇంటర్ పూర్తయ్యే నాటికి పెడ్లర్‌గా మారాడు. స్నేహితుడితో ఏపీలోని విశాఖపట్నం ఏజెన్సీకి వెళ్లి గంజాయి తీసుకొస్తూ పట్టుబడ్డాడు. అప్పటి వరకు తమ కొడుకు బుద్ధిమంతుడని భావించిన కన్న పేగు తల్లడిల్లి పోయింది. తాజాగా హైదరాబాద్ కూకట్ పల్లి సంగీత్ నగర్‌లో పదేళ్ల బాలిక హత్య కేసులో నిందితుడు పదో తరగతి విద్యార్థి అని తెలియగానే పోలీసులు ఉలిక్కి పడ్డారు. రాష్ట్రంలో పలు కేసుల్లో పట్టుబడుతున్న జాబితాలో జువెనెల్స్ (బాల నేరస్తులు) ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అమ్మాయిలను వేదిస్తూ షీ టీమ్స్‌కు చిక్కుతున్న వారిలో పది శాతం మంది మైనర్లే ఉంటున్నారు. వీరిలో ఎక్కువ మంది తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువైన వారే.. పిల్లల పెంపకంలో లోపాలు భవిష్యత్తులో వారిని దారి తప్పేలా చేస్తాయి. రోజూ కొంతసేపైనా నాణ్యమైన సమయాన్ని వారికి కేటాయించి బిడ్డలను సరిదిద్దుకోవచ్చు

**ఎందుకిలా మారుతున్నారంటే..**

పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చులు పెరుగుతున్నాయి. అదనపు ఆదాయం కోసం తల్లిదండ్రులు ఇద్దరూ శ్రమించాల్సిందే. ఉదయం వెళ్లి సాయంత్రం ఇల్లు చేరుతున్న దంపతులు ఒత్తిడి మూలంగా బిడ్డలపై పూర్తిస్థాయి దృష్టి సారించలేకపోతున్నారు. కుటుంబ కలహాలు, ఆలు మగల మధ్య మనస్పర్థలు తలెత్తినప్పుడు వాటి ప్రభావం చూపుతుందని మనస్తత్వ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో బాలుడి తల్లి ఓ ల్యాబ్‌లో పనిచేస్తోంది. తండ్రి కిరాణా దుకాణం నడిపి నష్టం రావడంతో మానేశాడు. అతను మద్యానికి అలవాటు పడ్డట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. ఎదిగే వయసులో బిడ్డ సెల్ ఫోన్‌లో ఏం చూస్తున్నాడు అనేది గమనించ లేకపోయారు. తరచూ పాఠశా లకు గైర్హాజరు అవుతుంటే ప్రశ్నించ లేకపోయారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిషేధిత ఈ - సిగరెట్లకు అలవాటు పడిన 80 మంది పిల్లల్ని ఇటీవలే గుర్తించారు. వీరంతా తల్లిదండ్రుల యూపీ ఐ ఖాతాల నుంచి నగదును బదిలీ చేశారు. రూ. వేలల్లో డబ్బులు పంపుతున్నా చూసి చూడనట్లు వదిలేశారు. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినప్పుడు తమ పిల్లలు అమాయకులని, తప్పంతా పోలీసులదే అన్నట్లుగా మాట్లాడారట. పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేయడం, స్నేహితులకు షేర్ చేస్తున్న వారిలో 14-19 ఏళ్ల వయసువారే ఎక్కువగా ఉంటున్నారు.

**పిల్లలేం చేస్తున్నారో దృష్టి సారించండి..**

పిల్లలపై నమ్మకం ఉండాల్సిందే. అయినా వారేం చేస్తున్నారో గమనించాలని మనస్తత్వ నిపుణులు అంటున్నారు. బిడ్డలను గారాబం చేస్తూ అడిగిందల్లా కొనివ్వడం ప్రమాదకరం. ఇంటి వాతావరణం కూడా పిల్లలపై ప్రభావం చూపుతుంది. తల్లిదండ్రులు నిత్యం బాధపడుతుంటే వారు మానసిక ఒత్తిడికి గురవుతారు. దాన్నుంచి బయట పడేందుకు ఇతర మార్గాలు వెతుక్కుంటారు. ఆడ పిల్లలయితే ప్రేమ చూపేవారికి దగ్గర అవుతారు. ఇంటర్‌నెట్‌లో పిల్లలు ఏం చూస్తున్నారో గమనించాలని, అలాగే ఇటీవల కొత్తగా వచ్చిన యాప్‌ల ద్వారా పిల్లల ఫోన్లను తల్లిదండ్రులు తమ నియంత్రణ లోకి తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## అన్య మతస్తులు సెలూన్ షాపులు పెట్టొద్దు



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 23:** అన్య మతస్తులు సెలూన్ షాపులు పెట్టొద్దని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలో నాయీబ్రాహ్మలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు సంఘాల అధ్యక్షులు కొత్వాల్ కిషన్ నాయి, జనగామ సతీష్ నాయి మాట్లాడుతూ నాయీబాహ్మణులకు క్షౌరవృత్తి హక్కు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. యాభై సంవత్సరాలకే వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా కల్పించాలన్నారు. క్షౌరశాలల విద్యుత్ బకాయిలు చెల్లించాలని కోరారు. పట్టణంలోని నాయీబాహ్మణులు స్వచ్ఛందంగా వారి సెలూన్ షాపులను బందు చేసుకుని ర్యాలీని విజయవంతంగా పూర్తి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్వాల్ యాద నరేందర్, వేముల కుమర్, ఇరు సంఘాల ప్రధాన కార్యదర్శులు ముత్యాల బాలకృష్ణ, కొండ గణేష్, కోశాధికారులు కొత్వాల్ శ్రీనివాస్, మిరుదొడ్డి రాజు, ఉపాధ్యక్షులు కొత్వాల్ శంకర్, అల్మాజిపురం వెంకటేశం, కలకుంట్ల రాజు, సహాయ కార్యదర్శులు కొత్వాల్ నాగరాజు, కొండూరు కళ్యాణ్ , రెండు సంఘాల కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**జనం పవర్, సంగెం, ఆగస్టు 23:** గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం సంగెం మండలం ఎల్గూర్ రంగంపేట, ముమ్మిడివరం గ్రామపంచాయతీ భవనాలకు, కాట్రపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తోందన్నారు. మంత్రి సీతక్క పనుల జాతర లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. అందుకోసం ప్రతి గ్రామంలో అవసరమైన పనులను ప్రాధాన్యతగా గుర్తించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కొసమెరుపు:** ముమ్మిడివరం గ్రామపంచాయతీ భవనానికి ఎల్గూర్ రంగంపేట గ్రామంలో ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. దీంతో ముమ్మిడివరం గ్రామ ప్రజలు గ్రామంలో ప్రభుత్వ భూమి లేనందున ముందుగా గ్రామపంచాయితీ భవనం ఎక్కడ కడతారో స్థలాన్ని కేటాయించి భూమిపూజ చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారు.

## అల్లినగర్ గ్రామ అభివృద్ధికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సాయం



**జనం పవర్, పటాన్‌చెరు (గడ్డపోతారం), ఆగస్టు 23:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని అల్లినగర్ గ్రామ అభివృద్ధి పనుల కోసం అరబిందో ఫార్మా ఫౌండేషన్ నుంచి రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ శ్రీధర్ సూరత్, హెచ్‌ఆర్ మేనేజర్ శంకర్ ప్రసాద్‌లు చెక్కును మాజీ సర్పంచ్ ప్రకాష్ చారి, మద్దూరి పెంటేష్, వేణుగోపాల్, కుమార్, బాలయ్య, వీరేశంగౌడ్, ప్రదీప్ రాజ్, పి.రాజు తదితరుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. కాగా గ్రామ అభివృద్ధి కోసం పరిశ్రమల నుంచి ఇలాంటివి సహాయాలు అందడం సంతోషమని స్థానికులు తెలిపారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

**ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్**



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 23:** ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి శనివారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందన్నారు. సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయాలని సూచించారు. మంచి శక్తి సామర్థ్యాలతో పాటు అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. ఫిట్నెస్‌ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు.

గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధి నిర్వహణ ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఇతర సమస్యలు ఏమన్నా ఉంటే ఉన్నతాధికారులకు చెప్పుకునే వీలుంటుందన్నారు. చెడు అలవాట్లకు లోను కాకూడదన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమ శిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలన్నారు. జిల్లాకు, తెలం గాణ పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకు రావాలని కోరారు. సిబ్బందికి చేయవలసిన విధులు ,చేయకూడని పనుల గురించి పలు సూచనలు చేశారు. ఏదైనా వ్యక్తి గత సమస్యలు, డ్యూటీల వద్ద సమస్యలు, ఆరోగ్య సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలన్నారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్టకి భంగం కలిగించే విధంగా ప్రవర్తించరాదని హెచ్చరించారు. ఆరోగ్య పరీక్షలు రెగ్యులర్‌గా చేయించుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. సమయం దొరికినప్పుడు భార్యా పిల్లలతో ఉల్లాసంగా గడపాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. సర్వేసుకు సంబంధించిన, వ్యక్తిగత సమస్యలును అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, విష్ణు ప్రసాద్, రాజేష్, కార్తీక్, ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్ కుమార్, అంజయ్య, శ్రీధర్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం అందించాలి

**చింతమడక పీహెచ్‌సీనీ తనిఖీ చేసిన కలెక్టర్ కె.హైమావతి**



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 23:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రోగులకు అందించే వైద్య సేవలను పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్లను చెక్ చేశారు. స్టాఫ్ నర్సు నసీబ్ సుల్తానా, ఫార్మసిస్ట్ మాత్రమే ఉన్నారని మెడికల్ ఆఫీసర్ జి.భాస్కర్ 13 నుంచి విధులకు రావట్లేదని అడిగారు. వర్గల్ మండలంలో డిప్యూటెషన్ ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడి రోజు 70 నుంచి 80 మంది ఓపీ ఉండే ఆసుపత్రి డాక్టర్‌ను డిప్యూటిషన్ ఇవ్వకూడదని చెప్పారు. తప్పనిసరిగా రెగ్యులర్ డాక్టర్‌ను ఆసుపత్రిలో ఉంచాలన్నారు. అన్ని డిప్యూటిషన్‌లను రద్దు చేయాలని ఆదేశించారు. లింగయ్య సీఎచ్‌ఓ లీవ్ లెటర్ పెట్టి శాంక్షన్ కాకుండా సెలవు తీసుకున్నారని రిజిస్టర్‌లో కంప్లైంట్ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రికి డాక్టర్లు వస్తారా అని ఆరా తీశారు. డాక్టర్ అప్పుడప్పుడు వస్తారని, నర్సులు బాగా చూస్తారని కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని, అన్ని సౌకర్యాలు, సిబ్బంది డాక్టర్లను ప్రభుత్వం నియమించిందని తెలిపారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి




**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 23:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లోపే నెరవేర్చాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, స్వాతంత్ర సమరయోధులు వంగ గాలి రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు మిట్టపల్లి స్వరూపరాణి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శనివారం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం జరగాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో కేసులు ఎత్తివేయాలని, తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాలు స్థలంతో పాటు నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులకు ప్రతినెల 30 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల కుటుంబాలకు హెల్త్ కార్డులు, ప్రభుత్వ పథకాల్లో ఉద్యమకారులకు మొదటి ప్రాధన్యత ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో 2 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో చెన్నోజు సుదర్శన్, వాసంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లె భారతి, కావేరి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా
- గణేష్ నవరాత్రి, మిలాద్-ఉన్-నబీ సందర్భంగా శాంతి సమావేశం

**జనం పవర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఆగస్టు 23:** శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా కోరారు. గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ పండుగల నేపథ్యంలో శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ క్వార్టర్స్‌లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపెల్లి మంచిర్యాల జోన్ పరిధిలోని అన్ని వర్గాల మత పెద్దలతో శాంతి సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో అన్ని మతాల పెద్దలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. గత సంవత్సరం రామగుండం కమిషనరేట్ పరిధిలో 4786, మంచిర్యాల జోన్ పరిధిలో 2316, పెద్దపెల్లి జోన్ పరిధిలో 2476 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సంవత్సరం వినాయక విగ్రహాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు అన్ని వివరాలతో సంబంధిత పోలీస్ స్టేషన్లో సంప్రదించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వాటి వివరాల ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేస్తామని, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా శోభాయాత్ర సాఫీగా సాగేలా రూట్ మ్యాప్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తామన్నారు.

గణపతి మండపాల వద్ద జరిగే కార్యక్రమాలకు బాధ్యత వహిస్తూ ప్రతి ఒక్క గణపతి మండప కమిటీ అధ్యక్షుడు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. గణేష్ మండపాల వద్ద సీసీ




కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 24 గంటలు ప్రతి విగ్రహం వద్ద ఇద్దరు తప్పనిసరిగా ఉండాలని, పాయింట్ బుక్ ఏర్పాటు చేస్తామన్నారు. బ్లూ క్లోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి చెక్ చేస్తారని తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకూడదని హెచ్చరించారు. విద్యుత్ శాఖ అనుమతి లేకుండా మండపాలకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయకూడదన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు.

విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల చుట్టుపక్కల నిమజ్జనం వెళ్లే దారులలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ముందుగానే చూసుకోవాలన్నారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఏలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే డయల్ 100, కమీషనరేట్ కంట్రోల్ రూం 8712656597 కానీ లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసి లా అండ్ ఆర్డర్ సమస్యకు కారణమైతే అట్టి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని మతాలకు



సంబంధించిన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం నిఘా ఉంచి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను సంతోషంగా జరుపుకునేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ అధికారులను ఆదేశించారు. గణేష్ నిమజ్జనంతో పాటు, మిలన్-ఉన్-నబీ పండుగలు రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో పోలీస్ శాఖ రోడ్ మ్యాప్‌ను అనుసరించాలని పోలీస్ వారికీ శాంతి కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎమ్ రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ ఏ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావు, పెద్దపెల్లి సీఐ ప్రవీణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్, ఇతర వింగ్స్ ఇన్స్పెక్టర్లు, పీస్ కమిటీ సభ్యులు, అన్ని మతల పెద్దలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు



**జనం పవర్, మంచిర్యాల, ఆగస్టు 23:** మంచిర్యాల శాసన సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్యంతో తిరిగి మంచిర్యాల వస్తున్న సందర్భంగా ఆయన పూర్తి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి, వాసవి మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం శివాలయంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడుతూ 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మంచిర్యాల నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు కేవలం సంవత్సర కాలంలోనే రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచారన్నారు. విద్య వైద్య రంగాన్ని ఎంతో అభివృద్ధి చేసారన్నారు. మంచిర్యాల ప్రజలు ఎన్నడూ చూడని విదంగా మంచిర్యాలకు తలమానికంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు శేరవేగంగా జరుగుతున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రేమ్ సాగర్ రావు ఆయన కుటుంబ సభ్యులు పూర్తి ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మామిడిశెట్టి వసుందర, రామగిరి బానేష్, వేములపల్లి సంజీవ్, సంబంధిత వార్డు ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికార లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



**జనం పవర్, భైంసా, ఆగస్టు 23:** అధికార లాంచనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు శనివారం నిర్వహించా. గత రెండు రోజుల క్రితం ఆగ్రాలోని జలపాతంలో గల్లంతై మృతి చెందిన భారతదేశ వైమానిక దళంలో పనిచేస్తున్న లక్ష్మీ ఈశ్వర్ ప్రసాద్ మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో ఆయన స్వగ్రామం ముథోల్ మండలంలోని తరోడకు తీసుకు వచ్చారు. అనంతరం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎయిర్ ఫోర్స్ అధికారి ప్రవీణ్‌సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో ఆర్మీ జవాన్ అంతక్రియలు జరిగాయి. చివరి చూపు కొరకు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సిస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా: ఏవో సారిక



**జనం పవర్, భైంసా, ఆగస్టు 23:** యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందవద్దని కుబీర్ మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు. కుబీర్ మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎప్పటికప్పుడు అవసరమైన యూరియా బస్తాల లోడు వస్తుందన్నారు. యూరియా కావలసిన రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని కార్యాలయంలో సంప్రదింస్తే పరిశీలించి యూరియాను అందిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి పుకార్లను నమ్మొద్దని రైతులకు సూచించారు.

## విద్యార్థులకు ఫేషియల్ అటెండెన్స్ ప్రారంభం..

**జనం పవర్, భైంసా, ఆగస్టు 23:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ ఆదేశాల మేరకు కుబీర్ పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఫేషియల్ అటెండెన్స్ రిజిస్టర్ ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ పి.సునీల్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థి ఎఫ్ఆర్ఎస్ నమోదు తప్పకుండా చేసుకోవాలన్నారు. దీని ద్వారానే హాజరు గుర్తింపు ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఇదే పరీక్ష రుసుము, స్కాలర్‌షిప్‌కు ఆధారమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళల అభివృద్ధికి ఐటీడీఏ ఐటీసీ చేయూత



**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23:** స్వసక్తితో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి జీవనోపాధి పెంపొందించుకొని ఉపాధి పొందుతున్న గిరిజన మహిళలకు ఐటీడీఏ ఐటీసీ ద్వారా చేయూత అందించి వారి పరిశ్రమలను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శనివారం చర్ల మండలం సున్నం గుంపు గ్రామంలోని ముత్యాలమ్మ జాయింట్ లియబిలిటి గిరిజన మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల తినుబండారాల పదార్థాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులలో దొరికే అటవీ ఉత్పత్తులను సేకరించి నిత్యవసరాలకు వాడుకొనడమే కాక సహజంగా దొరికే ఇప్పపూవుతో మంచి ఆరోగ్యానికి సంబంధించిన ఆహార పదార్థాలు తయారు చేసి వాటిని అమ్మకాలు జరుపుకొని జీవనోపాధి పొందుతున్నారని, ఇప్పపువ్వుతో మంచి సహజ గుణాలు కలిగిన డ్రై ఫ్రూట్స్ మిక్స్ చేసి ఇప్పపువ్వు లడ్డులు, బర్ఫీ చాక్లెట్లు ఔషధ గుణాలు కలిగిన వనమూలికలతో వివిధ రకాల కారంపొడి పచ్చళ్లు తయారు చేసి అమ్మకాలు జరుపుకుంటున్నారని అన్నారు. వీరు తయారు చేసే ప్రతి తినుబండారాలు నాణ్యతగా ఉంటూ పిల్లలకు పెద్దలకు వారి అభిరుచికి తగ్గట్లు మంచి రుచికరంగా తయారు చేస్తున్నారని ఈ మహిళలు స్వశక్తితో జీవనోపాధి కల్పించుకుంటున్నారని అన్నారు. ఈ మహిళలు తయారు చేస్తున్న ఆహార పదార్థాల ప్రొడక్ట్స్ బ్రాండింగ్ ప్యాకింగ్ విషయంలో మహిళలకు చేయూత అందించడానికి ఐటీడీఏ ఐటీసీ ద్వారా సపోర్ట్ చేయడానికి ఒక నాలుగు సంఘాలను గుర్తించామని వారు తయారు చేసే వస్తువులను పరిశీలించిన తర్వాత వారి చిన్న తరహా పరిశ్రమలను మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పించడానికి ప్రణాళికల రూపొందిస్తున్నామని అన్నారు. గ్రామాలలో నివసించే కుటుంబాలు చిన్నారుల తల్లిదండ్రులు వీరు తయారు చేసే ప్రతి వస్తువు ఆరోగ్యానికి నాణ్యతగా రుచికి తగ్గట్లు ఉన్నందున అందరూ కొనుగోలు చేసి ఈ పరిశ్రమలను అభివృద్ధి బాటలో తీసుకెళ్లడానికి మీ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటిసి మేనేజర్ చంగల్ రావు, ప్యాకింగ్ డిజైనింగ్ కోఆర్డినేటర్ బేగ్, మహిళా సభ్యులు సమ్మక్క, మునెమ్మ, శ్రీదేవి, రమాదేవి, శిరీష, ఈశ్వరి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి హరితహారం



**జనం పవర్, నస్పూర్, ఆగస్టు 23:** శనివారం రోజున నస్పూర్ పట్టణంలోని 12వ వార్డులో మొక్కలు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు బొద్దున సంధ్యారాణి-రామ్మూర్తి, వార్డు అధికారులు ప్రియదర్శిని, స్వరూప, రాజమల్లు, మున్సిపల్ సిబ్బందితో కలిసి రామకృష్ణ ఇంటింటికి మొక్కలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ స్థానికంగా పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు ఆదేశాల మేరకు ప్రతి ఇల్లు అందమైన పూల మొక్కలతో, పళ్ళ మొక్కలతో ప్రకృతి వనాన్ని తలపించే విధంగా పెంచాలని మహిళలను కోరినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి వారి ఇండ్లలో పూల మొక్కలు పళ్ళు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, యూత్ ప్రెసిడెంట్ హరీష్, మైనార్టీ ప్రెసిడెంట్ జమాల్, కాంగ్రెస్ కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నట్లు తెలిపారు.

## కానుకలు వద్దు.. సాయం చేయండి..

**- భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్**
**- గణేష్ నిమజ్జన స్థలం పరిశీలన**



**జనం పవర్, భైంసా, ఆగస్టు 23:** ఇటీవల భైంసా డివిజన్ సబ్ కలెక్టర్‌గా అజ్మీర సంకేత్ కుమార్ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. పట్టణ పౌరులు, ప్రజా ప్రతినిధులు, తదితర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంఘాల సభ్యులు, రాజకీయ నాయకులు తనను కలిసేందుకు విచ్చేసిన క్రమంలో శాలువాలు, బొకేలు, పుష్పగుచ్చాలు, ఇతరత్రా భౌతిక కానుకలు తీసుకురావద్దని భైంసా సబ్ కలెక్టర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సమస్యలను తెలుసుకోవడం, అవసరమైన సహాయాన్ని అందించడం సబ్ కలెక్టర్‌గా ప్రధాన కర్తవ్యమని, గౌరవాన్ని ఏదైనా రూపంలో వ్యక్తపరచాలని అనుకుంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ లేదా విద్యా సంబంధిత ఇతర వస్తువులు దానం చేయాలని తెలిపారు. ఇలాంటి సహకారాల ద్వారా విద్యార్థుల విద్యాభివృద్ధికి, మన ప్రాంత భవిష్యత్తు పురోగతికి తోడ్పాటు అందుతుందని తెలిపారు. అనంతరం భైంసా పట్టణ సమీపంలో గడ్డెన్న ప్రాజెక్ట్ వద్ద గణేష్ నిమజ్జనం స్థలాన్ని సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ శనివారం పరిశీలించారు. విగ్రహాల నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రాజెక్టు కదా గజ ఈతగాళ్లను తప్పకుండా అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జన సమయంలో ప్రతి ఒక్క అధికారి అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాయమాటలతో కాంగ్రెస్ పాలన

**ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే**
**బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు జీవీకే మనోహర్ డిమాండ్**
**సమస్యలపై ప్రదర్శన, తహసీల్దార్‌కు వినతిపత్రం**




**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23:** మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పాలన నడుస్తుందని హామీలను అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు జీవీకే మనోహర్ విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చే విషయంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందన్నారు. ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ వెళ్లే సెంటర్ నుంచి బీజేపీ ఆధ్వర్యంలో ప్రదర్శనగా బయలుదేరి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీవీకే మనోహర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. రైతుల సంక్షేమాన్ని సీఎం రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారన్నారు. వ్యవసాయ పంటలకు యూరియాను సరిపడా సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లో నిలబడి ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీనాయక్ మాట్లాడుతూ మైలారం రాగి గనులను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అంబ సత్రం భూములకు హక్కు పత్రాలను కల్పించాలన్నారు. కారుకొండ, సీతారాంపురం సమీపంలో పెద్ద వాగుపై చెక్ డ్యాం నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎరువులను సకాలంలో అందించాలని కోరారు. రేగళ్ల పరిధిలో గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆర్లగండి రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. కొత్తూరు రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రతీ నెల రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని కోరారు. రైతులకు, కౌలు రైతులకూ ఎకరా నికి 15 వేలు, వ్యవసాయ కూలీలకు 12 వేలు, వరి పంటకు రూ.500 బోనస్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేయాల న్నారు. పెంచిన నెలవారి పెన్షన్ 4 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ భీమా పకడ్బందీగా అమలు చేయాల న్నారు. సర్పంచుల కాలం ముగియడంతో తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామాల్లో పారిశుధ్యం దారు ణంగా తయారైందని మండిపడ్డారు. ప్రతినెల పారిశుధ్య కార్మికు లకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పైడిపాటి రవీందర్, జల్లారపు శ్రీనివాసరావు, టౌన్ ప్రెసిడెంట్ సాగర్ రెడ్డి, జీవీకే శివ, బడిషా శివాజీ, నవీన్ కుమార్, కవిత, రమాదేవి, గౌరీ, సంపత్, సాంబ శివరావు, రాము, వెంకన్న, అరుణ, ధనలక్ష్మి, కళావతి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నేతన్నలకు శుభవార్త

## -65 లక్షల చీరల తయారీకి ప్రభుత్వం ఆర్డర్ - మహిళలకు ఈసారి రెండు చీరల అందజేత

**జనం పవర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాబ్యూరో, ఆగస్టు 23:** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. బతుకమ్మ పండుగ సందర్భంగా ఈసారి మహిళలకు కానుక ఇవ్వడానికి రెడీ అవుతోంది. ప్రభుత్వం తరపున మహిళలకు రెండు ఇందిరమ్మ చీరలను కానుకగా ఇవ్వాలని సర్కార్ నిర్ణయించింది. భాగంగా ఈసారి ఇందిరా మహిళా శక్తి పథకం కింద సిరిసిల్ల నేతన్నలకు భారీగా ఉపాధి కల్పించనుంది. అందులో భాగంగానే 65 లక్షల చీరల తయారీకి ఆదేశాలు జారీ చేసింది.

### మహిళలకు చీరల పంపిణీ

గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పేరుతో ప్రతి బతుకమ్మ పండుగకు చీరలను మహిళలకు కానుకగా ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పేరుతో దసరా సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేయడానికి సిద్ధమవుతోంది. ఈ చీరల ఉత్పత్తిని వేగవంతం చేయడానికి మహిళా పొదుపు సంఘాలను భాగస్వామ్యం చేసింది. రేవంత్ ప్రభుత్వం పొదుపు సంఘాలలో ఉన్న ప్రతి మహిళకు ఉచితంగా రెండు చీరలు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తోంది.



సిరిసిల్ల నేతన్నలతో 65 లక్షల చీరల తయారీ

ఇప్పటికే సిరిసిల్ల నేతన్నలకు ఈ మేరకు ఆర్డర్లు జారీ చేసిన సర్కార్ మొత్తం 65 లక్షల చీరల తయారీని చేయిస్తోంది. సిరిసిల్లలోనినే ఏడాది పొడుగునా ఉపాధి కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చింది. ఈ హామీ అమలులో భాగంగా ప్రస్తుతం వీరికి ఇందిర మహిళా శక్తి పథకం కింద చీరల తయారీకి ఆర్డర్ ఇచ్చింది. ఈ పథకం కోసం 318 కోట్ల రూపాయలను కేటాయించి ఇందిరమ్మ చీరలను ఉత్పత్తి చేస్తుంది. ఇందిర మహిళా శక్తి పథకంతో సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి తెలంగాణ సర్కార్ అందించే ఈ పథకం వల్ల సుమారు 6 వేల మంది కార్మికులు నెలకి 20వేల చొప్పున సంపాదిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే బతుకమ్మ పండుగ నేపథ్యం లో సిరిసిల్ల నేతన్నలు దాదాపు 30 లక్షల చీరలను ఉత్పత్తి చేశారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్ ఈ చీరలు ఉత్పత్తిని పర్య వేక్షిస్తున్నారు. ఒకటి కాదు రెండు చీరలను సిద్ధం చేస్తున్న తెలంగాణా సర్కార్ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహి ళలకు అందించిన చీరలు నాసిరకం చీరలుగా ఉన్నాయని ఆరోపణలు వచ్చిన క్రమంలో, ప్రభుత్వ హయాంలో అటువంటి పరిస్థితి లేకుండా నాణ్యమైన బట్టతో చీరలను నేయిస్తున్నారు. ఈసారి బతుకమ్మ పండుగకు మహిళా సంఘాల మహిళలకు ఇచ్చే ఈచీరల ధర ఒక్కొక్కటి ఎనిమిది వందల రూపాయలుగా ఉంటుందని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు చీరలను ఇచ్చి బతుకమ్మ పండుగ కానుక ఇస్తుందని చెబుతున్నారు.

# హత్య కేసును చేధించిన పోలీసులు

## వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 23:** ఎనుముల శివయ్య, తండ్రి ఎనుముల కిష్టయ్య తన తండ్రి ఇంట్లో మరణించాడని పానగల్ పోలీ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదుతో పానుగల్ ఎస్సై కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోని హత్య కేసు వివరాలను విలేకరుల సమావేశంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఎనుముల కిష్టయ్య తండ్రి గున్నయ్య, గొర్రెల వ్యాపారంతో పానగల్ గ్రామంలో జీవనం సాగిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన వసంతపురం రాములు తన వ్యక్తిగత కక్ష్యతో ఎనుముల కిష్టయ్యను పథకం ప్రకారం హత్య చేసిన ఘటనను పోలీసులు చేధించారు. రాములు తన భార్య విడిచి వెళ్లడానికి కిష్టయ్య కారణమని అనుమానంతో, డబ్బులు దొంగలించి బైక్ కొనాలనే ఉద్దేశంతో కిష్టయ్యను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అతని పథకం ప్రకారం ఈనెల 20 తేదిన రాత్రి కిష్టయ్య ఇంటిలో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో రాములు అతని తలపై పప్పుగుత్తితో బలంగా కొట్టి, అనంతరం గొంతు పట్టుకొని ఊపిరి రాడ నివ్వకుండా చేసి హత్యచేశాడు. అనంతరం అతని జేబులో ఉన్న రూ.40,000 నగదును దోచుకొని, నేరంలో వాడిన పప్పుగుత్తిని కాడను ఎవరు గుర్తించకుండా మురికి కాలువలో పార వేశాడు. నిందితుడు హత్య అనంతరం వన పర్తి పట్టణంలో తిరుగుతూ రూ.6,000 ఖర్చు చేసి, మిగిలిన రూ.33,000ను తన ఇంటిలో దాచి పెట్టాడు.

శనివారం గ్రామంలో తిరుగుతూ ఉన్న సమయంలో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు విచారణలో, నిందితుడు తన నేరాన్ని అంగీకరించడంతో పోలీసులు నగదు, రక్తపు మరకలు ఉన్న బట్టలు, నేరానికి ఉపయోగిం చిన పప్పుగుత్తి కాడను స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ కు తరలించారు. కేసు చేధించడంలో కీలకపాత్ర పోషించిన వనపర్తి సీఐ, కృష్ణయ్య, పానగల్ ఎస్సై శ్రీనివాసులు, కానిస్టేబుళ్లలను వనపర్తి డిఎస్పీప్రత్యేకంగా అభినందించి నగదు రివా ర్డు అందజేస్తామని తెలిపారు.

## సీజనల్ వ్యాధుల అవగాహనపై అధికారుల సమీక్ష సమావేశం



**జనం పవర్,మాడుగులపల్లి, ఆగస్టు 23 :** నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ జి .వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నందు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు .ప్రతి శాఖ కు సంబంధించిన విషయాలపై చర్చించి సీజనల్ వ్యాధుల పై గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి మండల ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. అదేవిధంగా వెటర్నటి డిపార్ట్మెంట్ పరంగా వీధి కుక్కలు పాములు కోతులు ఇతర జంతువుల గురించి అవేర్నెస్ ప్రోగ్రాము నిర్వహించాలని అధికారులకు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలలో శానిటేషన్ చేయాలని అధికారులు సమన్వయంతో కలిసి చేయాలని అధికారులకు సూచించారు లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోరారు అదేవిధంగా అక్రమ యూరియా నివారణ విషయంలో కూడా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారికి సూచించడం జరిగింది ఇలా అన్ని శాఖలకు వారి శాఖలకు సంబంధించి ప్రోగ్రామ్స్ కండక్ట్ చేస్తూ వారి వారి విధులు నిర్వహించవలసిందిగా ఆదేశించినారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు తగు జాగ్రత్తలు చేపట్టాలని గర్భిణీ బాలింతలకు పోషకాలు అందజేయాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరోజ పావని, ఇంచార్జ్ ఎంపీడీవో సంగీత, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పరారైన చీరల వ్యాపారి

**జనం పవర్ గంగాధర, ఆగస్టు 23:** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన మిట్టపెల్లి రాజేశం చీరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని ఇంట్లో అద్దెకు ఉంటూ వ్యాపారం చూసుకుంటున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన వినోత్ రాజ్‌తో రాజేశానికి పరిచయం ఏర్పడింది. మొదట్లో రాజేశం, వినోత్‌కు చీరలు ఇచ్చి డబ్బులు తీసుకునేవాడు.కానీ కొంతకాలానికే వినోత్ రాజ్ రాజేశం, గ్రామానికి చెందిన ఇతరుల వద్ద నుండి నమ్మకంతో మొత్తం రూ.70,27,800/- విలువైన టెక్స్టైల్ దుస్తులు తీసుకున్నాడు. అయితే, బాకీ డబ్బులు చెల్లించకుండా పరారీ అయినట్లు సమాచారం. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గంగాధర ఎస్ఐ బి. వంశీ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డీజే ఆపరేటర్లకు మాడుగుల సిఐ కౌన్సిలింగ్

**మాడుగుల, ఆగస్టు 23:** మాడుగుల మండలంలోని డీజే సిస్టం ఆపరేటర్స్ రానున్న వినాయక చవితి దసరా నిమర్జనాల సందర్భంగా ప్రజల ఆరోగ్యానికి హానీ చేసే డీజే సిస్టమ్స్‌ను ఆపరేటు చేసి అధిక సౌండ్ పొల్యూషన్ చేయకుండా మండల డిజే ఆపరేటర్స్ అందరికీ మాడుగుల పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం మాడుగుల తాసిల్దార్ కార్యాలయంలో తల లక్ష రూపాయల పూచికత్తుతో తహసిల్దారు ముందు బైండోవర్ చేయడమైనది. కావున గణేష్ దసరా నిమర్జనాల సందర్భంగా డీజే సిస్టంను ఎవరైనా ఆపరేట్ చేసిన అట్టి డీజే సిస్టంను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మాడ్గులసీఐ వేణుగోపాలలో తెలిపారు

## సీపీఎస్ రద్దు చేయాలని తపస్ తహసీల్దార్‌కు వినతి

**మద్నూర్, ఆగస్టు 23:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు కోరుతూ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు అనంతరం ప్రభుత్వానికి సిపిఎస్ రద్దు చేయాలని మద్నూర్ తాసిల్దార్ ముజీబోదిన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నాంపల్లి మల్లేశం, తపస్ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రచ్చ శివ కాంత్, మద్నూర్ మండల అధ్యక్షులు పండరినాథ్, ప్రధాన కార్యదర్శి అజిత్ కుమార్ పవర్, జిల్లా కార్యదర్శి గోజ సంజయ్, మండల సభ్యులు సత్యం, ఉపాధ్యాయులు షాహిన్ బేగం, షాహిన్ ఫాతిమా, బూతులు ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.



## అధికారులకు మట్టి గణపతుల అందజేత



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 23:** పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యవేక్షణలో మట్టిగణపతులు, మొక్కలు, కుంకుమలను తయారు చేయించి, పంపిన వాటిని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, పొన్నం సత్యం దేవేందర్‌లు కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ ఆశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## యూరియా నిల్వలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేయాలి

### మూడు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్

**జనం పవర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఆగస్టు 23:** జిల్లాలలో యూరియా నిలువలపై అదేవిధంగా సరఫరా విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు నిరంతరం అప్రమత్తతతో పర్యవేక్షణ చేస్తూ ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. యూరియా కొరత సరపర వాటి విలువలు పర్యవేక్షణపై సిద్ధిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఉదయం ఫోన్లో మాట్లాడారు కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో అందగా పోవడం వల్ల రాష్ట్రంలో కొరత ఏర్పడిన నేపథ్యంలో ఉత్తర తెలంగాణ జిల్లా లోని యూరియా నిలువలు, సరఫరాల విషయంలో మరింత పర్యవేక్షణ కోసం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో సరిపడా యూరియా అందేలా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు. మండలాల వారీగా ప్రతిరోజూ యూరియా పంపిణీపై రిపోర్ట్ అందజేయాలని, ఎరువుల పంపిణీలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా విజిలెన్స్ మానిటరింగ్ కఠినంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. యూరియా కొరత రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

## మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**జనం పవర్, చింతపల్లి, ఆగస్టు 23:** చింతపల్లి మండల శాఖ పిఆర్టియు ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటవ తేదీన సిపిఎస్ అంతం ఓపిఎస్ కావాలని ఇందిరా పార్కులో జరగబోయే మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు పాల్వాయి వాసుదేవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బసవరాజు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు మారెడ్డి నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

## కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

**జనం పవర్, జమ్మికుంట, ఆగస్టు 23:** జమ్మికుంట పట్టణ పరిధిలోని పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో శనివారం కవాతు చేపట్టారు. రానున్న వినాయక చవితి, దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గాంధీ చౌరస్తా నుండి వీధుల వెంబడి తిరుగుతూ కవాతు చేశారు. నవరాత్రుల ఉత్సవాలు పట్టణ ప్రజలు చాలా సంతోషంగా, ఎలాంటి అల్లర్లు జరుగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని తెలియజేసారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్, పోలీస్ శాఖ బృందానికి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.

## వీధి కుక్కల కోసం ప్రత్యేక బంధాలు

**జనం పవర్, హుజురాబాద్, ఆగస్టు 23:** హుజురాబాద్ పట్టణంలో వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కుక్కలను పట్టుకోవడానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రత్యేక బృందాలను రప్పించారు. పట్టుకున్న కుక్కలను యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి అక్కడ స్టెరిలైజేషన్ వ్యాక్సినేషన్ చేసిన తర్వాత తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టనున్నారు. పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా 107వ ఉర్సు ఉత్సవాలు

**జనం పవర్,రామగుండం, ఆగస్టు 23:** అంతర్గాం మండలంలోని జామా మస్జిద్‌లో గరీబ్ నవాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆగస్టు 22న ఇమామ్ అహ్మద్ రజా 107వ వర్ధంతి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఇమామ్ అహ్మద్ రజా చేసిన సేవలను స్మరింపజేశారు. కార్యక్రమానికి గోలివాడ పొట్యాల్‌కు చెందిన మూడు మస్జిద్‌ల ముస్లింలతో పాటు రొంపికుంట, కన్నాల, ఎన్‌టిపిసి గోదావరిఖని ప్రాంతాల నుండి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో పాల్గొన్న వారికి అన్నదానం కూడా ఏర్పాటు చేశారు.

## ప్రభుత్వ భూమిలో ఉన్న షాపులను తొలగించాలి

**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 23:** మాడుగులపల్లి మండలంలోని కనేకల్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయ స్థలం పోస్ట్ ఆఫీస్ ముందు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు గల స్థలాలో అక్రమంగా నిర్మించిన షాపులను తొలగించాలని గ్రామానికి చెందిన చిట్యాల వెంకన్న అన్నారు. ప్రభుత్వ భూమిని అక్రమించడం వలన గ్రామంలో గొడవలు జరుగుతున్నాయని,పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా జిల్లాయంత్రాగం పట్టించుకోని ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడాలని చిట్యాల వెంకన్న కోరారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ - సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు**





**జనం పవర్, హనుమకొండ, ఆగస్టు 23:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ, సాధికారత శాఖల మంత్రి అడ్లూరి హనుమకొండ జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, మైనారిటీల సంక్షేమం, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతిలో జరుగుతున్న లోపాలను జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేసి సరి చేయాలని కలెక్టర్లకు తెలిపారు. ప్రతి గురుకుల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదులు పెట్టె క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. బాక్సులో వస్తున్న ఫిర్యాదులు, వాటికి గల కారణాలను వెంటనే తెలుసుకొని పరిష్కార మార్గాలను చూడాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురుకుల, ఆశ్రమ పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి అధిక నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి మెరుగైన ఫలితాలు అందించాలని ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, వివిధ గురుకులాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 23:** సిద్దిపేట కలెక్టర్ హైమావతి శనివారం పట్టణంలోని ఈవీఎం గోదాంను పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం చుట్టూ కలియ తిరిగారు. లాగ్ బుక్ చెక్ చేసి విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చుట్టూ సీసీ కెమెరాల పనితీరు, పోలీస్ అధికారులు 24/7 గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రెవెన్యూ అధికారులు తరుచు గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రహమాన్ తదితరులు ఉన్నారు.

## పాడి రైతులకు నగదు ప్రోత్సాహకం



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 23:** బెజ్జంకి మండల కేంద్రంలోని కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో మేలు రకమైన సంకరజాతి పశువుల నుంచి వచ్చిన సార్టేడ్ సెమెన్ ద్వారా పుట్టిన ఆడదూడలకు శనివారం నగదు ప్రోత్సకం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ డైరీ మేనేజర్ సీహెచ్ సుధాకర్ హాజరై మాట్లాడుతూ పాడే రైతుల అభ్యున్నతి కోసం కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పాడి రైతుల పిల్లలకు ఉన్నత చదువులు చదివేందుకు స్కాలర్షిప్స్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, నగదు ప్రోత్సకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల పాలకేంద్రం అధ్యక్షుడు ఎలిగే సతీష్, సూపర్వైజర్ ధనుర్బాను, డాక్టర్ రాజు, కార్యదర్శి బండారి రాములు, టెస్టర్ సీతా లక్ష్మణ్ డైరెక్టర్లు బాలేందర్, సంఘ రవీందర్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 23:** సిద్దిపేట జిల్లాలోని నంగునూర్, ఖాతా గ్రామాల్లో మృతుల కుటుంబాలను శనివారం రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్ పరామర్శించారు. నంగునూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త చెలుకాని మల్లేశం అమ్మ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఖాతా గ్రామంలో మంకీ యాదయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబాని పరామర్శించి భరోసా ఇచ్చారు. వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**- కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్**
**- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష**
**- అడ్డుకున్న సుబేదారి పోలీసులు**



**జనం పవర్, హనుమకొండ, ఆగస్టు 23:** సుబేదారి కళాశాలలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ను వెంటనే విడుదల చేయాలని కుడా మాజీ చైర్మన్, మాస్టర్‌జీ విద్యాసంస్థల అధినేత ఎస్. సుందర్ రాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫీజు దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుందర్ రాజు హాజరై దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ను విడుదల చేయకుండా విద్యార్థులను గోస పెడుతుందని ఆరోపించారు. వెంటనే పెండింగ్ లో ఉన్నటువంటి బకాయిలను విడుదల చేయాలన్నారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయకుంటే రాష్ట్రంలోని విద్యార్థులను కలుపుకొని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ,మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. తాను కూడా విద్యార్థుల పక్షాన ఉండి పోరాడతానని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ. 8,158 కోట్ల స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు విద్యార్థులు అనేక సమస్యలతో రాష్ట్రంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు రాష్ట్రానికి విద్య శాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంతో డబ్బులు లేక సర్టిఫికెట్లు తీసుకోక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగ సమస్యలపై దృష్టి పెట్టి రాష్ట్రానికి విద్యశాఖ మంత్రిని కేటాయించి పెండింగ్ స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్య మాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్య క్షులు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, ఎండీ ఇస్మాయిల్, పవన్ కుమార్, రాకేష్ రెడ్డి, అరుణ్ కుమార్, ప్రదీప్, కృష్ణ, సందీప్, రాజకుమార్, రాహుల్, సాయి పాల్గొన్నారు.

## రామేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే సతీమణి ప్రత్యేక పూజలు



**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 23:** పవిత్ర శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి అర్చన పిట్లం మండలంలోని చిన్న కొడపగల్ శ్రీ రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తోట అర్చనకు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జుక్కల్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, పాడి పంటలు, సుఖ సంతోషాలతో జీవించాలని ఆ పరమ శివున్ని ప్రార్థించినట్లు తోట అర్చన తెలిపారు.

## విద్యార్థులు పరిశోధన రంగాల్లో రాణించాలి

**- ప్రిన్సిపాల్ కె. అశోక్**




**జనం పవర్, జుక్కల్, ఆగస్టు 23:** విద్యార్థులు సెట్, నెట్ పరీక్షలు రాసి పరిశోధన రంగాల్లో రాణించాలని బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కె. అశోక్ సూచించారు. కళాశాలలో శనివారం పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఎంఏ తెలుగు, ఆంగ్లం, ఎంకాం విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు పోవాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని పేర్కొన్నారు. జీవితంలో వచ్చే ఒడుదొడుకులను అధిగమిస్తూ ముందుకు పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీజీ కోఆర్డినేటర్ టి.సంతోష్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకార సంఘం కార్యవర్గం ఎన్నిక



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 23:** బెజ్జంకి మండలం స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెగ్గలం రమాకాంత్, ఉపాధ్యక్షుడిగా కనపర్తి అనిల్, ప్రధాన కార్యదర్శిగా కటుకోజ్జుల నిరంజన్, కోశాధికారిగా చిలుముల సాయికిరణ్‌లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## గంజాయి రవాణాదారుల అరెస్టు



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 23:** సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామ శివారులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురు నిందితులను పట్టుకున్నట్లు సిద్దిపేట త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ తెలిపారు. నిందితులు పోలీసులను చూడగానే పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. కాని తాము అప్రమత్తమై వారిని పట్టుకున్నట్లు తెలిపారు. కామల్ల రాకేశ్, ఎండీ అమీర్, కుసుంబ ఆకాష్, రోడ్డ నర్సింలు వద్ద 254.9 గ్రాముల బరువు గల నిషేధిత గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు, రూ. 400 నగదు, రెండు మోటార్ సైకిళ్లు, గంజాయి తాగడానికి ఉపయోగించే రోల్ పేపర్, లైటర్ స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. స్వాధీన చేసుకున్న గంజాయి విలువ రూ. 6,370 ఉంటుందని తెలిపారు. పూర్తి విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో యువత గంజాయికి అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ సూచించారు. పిల్లల నడవడిక పట్ల తల్లిదండ్రులు ఎప్పుడు గమనిస్తూ ఉండాల న్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, గంజాయి సేవించిన వారి వివరాలు తెలిస్తే వెంటనే డయల్ 100 సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**కలెక్టర్ జితేష్ పాటిల్**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23:** ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకావాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని చెప్పారు. మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ తీగలకు తగలకుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని చెప్పారు. మన జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే అత్యంత భద్రత మధ్య నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళికరూపొందించుకోవాలని, గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పారు. నిమజ్జనం రూట్‌లో అవసరమైన రోడ్డు మరమ్మతులు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణాశాఖ అధికారి నుండి ధ్రువీకరణ తీసుకోవాలని చెప్పారు. ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. వ్యర్థాలు వేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా లోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టి గణపతులు పంపిణీ చేయనున్నామని, ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందన, డిపిఓ చంద్రమౌళి, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, కొత్తగూడెం, ఆర్డీవో మధు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జిలో మరమ్మతులు

**'జనం పవర్' ఎఫెక్ట్.. స్పందించిన అధికారులు**

**పత్రికా యాజమాన్యానికి కృతజ్ఞతలు**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23:** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రైల్వే అండర్ బ్రిడ్జి మధ్యలో ఉన్న నేషనల్ హైవే రోడ్డు మీద వరద నీరు చేరి నిల్వ ఉన్న కారణంగా గుంతలు ఏర్పడ్డాయి. ఇనుప చువ్వలు పైకి చొచ్చుకొని రావడంతో ఆ ప్రాంతం డేంజర్ స్పాట్‌గా మారింది. ఈ విషయంపై శుక్రవారం 'జనం పవర్' జాతీయ దినపత్రికలో 'రైల్వే అండర్ బ్రిడ్జిలో ప్రాణాలు పోతే బాధ్యులు ఎవరు..?' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనం అధికారుల దృష్టికి పోవడంతో వారు స్పందించి రైల్వే అండర్ బ్రిడ్జిలో రహదారికి అర్ధరాత్రి మరమ్మతులు చేపట్టారు. డేంజర్ స్పాట్‌గా నిలిచిన రైల్వే అండర్ బ్రిడ్జిపై కథనం ప్రచురించడం అధికారులు వెంటనే స్పందించడం పట్ల 'జనం పవర్ పత్రిక యాజమాన్యానికి' పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా బ్రిడ్జి మధ్యలో వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. బ్రిడ్జి సెంటర్‌లో లైటింగ్ సిస్టం కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని సూచిస్తున్నారు. కిందికి వేలాడుతున్న ప్రైవేట్ కేబుల్ వైర్లను కూడా తొలగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# భైంసాలో ఫ్రీజర్ సేవలు

**- అందుబాటులోకి తెచ్చిన డాక్టర్ ముత్యంరెడ్డి..**

**- మాతృమూర్తి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం**

**జనం పవర్, భైంసా, ఆగస్టు 23:**
తన తల్లి ప్రథమ వర్ధంతి సంవత్సరీకాన్ని పురస్కరించుకొని భైంసా పట్టణంలోని శ్రీ సాయి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ముత్యంరెడ్డి కుటుంబీకులు శనివారం మృతదేహాన్ని భద్రపరచుటకు అవసరమైన ఫ్రీజర్‌ను అందుబాటులోకి తెచ్చారు. మాతృమూర్తి జ్ఞాపకార్థంగా ప్రారంభించిన ఈ సదుపాయం స్థానికులకు అత్యంత ఉపయోగకరంగా ఉంటుందనీ అధికారులు, వైద్యవర్గాలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముత్యంరెడ్డి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తల్లి గారి ఆత్మకు శాంతి చేకూరాలన్న ఆశయంతో, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ సేవను ప్రారంభించామన్నారు. సామాజిక బాధ్యతతో ముందు కొచ్చి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఫ్రీజర్ సేవలు అందుబాటులోకి తెచ్చిన డాక్టర్ ముత్యం రెడ్డిని భైంసా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కదం మోహన్‌రావు పటేల్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చందూలాల్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, మాజీ అధ్యక్షుడు గాలి రవి తదితరులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఫ్రీజర్ సేవలను అవసరమున్నవారు 94413 75375, 6300 854960 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# ఓట్ చోర్.. గద్దీ చోడ్

**ఎన్ఎస్‌యుఐ, కాంగ్రెస్ నాయకుల ఆందోళన**




**జనం పవర్, జన్నారం, ఆగస్టు 23:** 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' నినాదంతో శనివారం జన్నారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్ఎస్‌యుఐ, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ, సోహెల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమంలో భాగంగా జన్నారంలో నిరసన చేపట్టామని తెలిపారు. బీజేపీ, ఈసీ కుమ్మక్కై ఓట్లను ఎలా దోచుకుంటున్నాయో ప్రజలకు వివరించాలని కోరారు. రాహుల్ గాంధీ గత కొన్ని రోజులుగా ఓట్లు చోరీ జరుగుతున్నాయని అనేక సందర్భాల్లో నిరసన చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో.. రాహుల్ గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ వారి స్ఫూర్తితో.. బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లు చోరీ చేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ విషయంపై పరిశీలించి తొందరగా నిర్ణయం తీసుకోవాలని, పోస్ట్ కార్డ్ ద్వారా గౌరవ రాష్ట్రపతి సంతకాలతో కూడిన వినతి పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు సోహైల్ షా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఫసి ఉల్లా, ముత్యం రాజన్న, రియాజుద్దీన్, మున్ను, లావణ్య, నాగేష్, మార్సుకోల తిరుపతి, యూత్ కాంగ్రెస్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్ ఖాన్, మండల అధ్యక్షులు దాసరి గణేశ్, మంద రాజేష్, జహీరోద్దీన్, వినీత్ పటేల్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు సాయి నాయక్ తదితరులు పాల్గొన్నారు..

# శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23:**
శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రాబోయే గణేష్ నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల రియల్ ఎస్టేట్‌పై చర్యలు తీసుకోవాలి

**- రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ - సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం**



**జనం పవర్, బెల్లంపల్లి, ఆగస్టు 23:** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ ఎర్ర గుంట చెరువుకు గండి కొట్టిన తిరుమల వెంచర్ (తిరుమల హిల్స్) రియల్ ఎస్టేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 6 దశాబ్దాలకు పూర్వం నుండి ఎర్ర చెరువు ఉందని అన్నారు. ఈ చెరువు కింద సుమారు 60 ఎకరాలకు పైగా పొలాలు ఉండేవని, మత్స్యకారులు చేపలు పెంచుకొని ఉపాధి పొందేవారు మేతకు వెళ్లిన పశువులు, మేకలకు నీరు, పచ్చిక గడ్డి ఉండేదని, చెరువు కట్ట వెంట 20, 30 సంవత్సరాల తాటి చెట్లు ఉండి గీత కార్మికులకు ఉపాధినిచ్చేవని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఈ చెట్లను కూకటి వేళ్ళతో పీకేశారని తెలిపారు. తిరుమల హిల్స్ రియల్ ఎస్టేట్ యాజమాన్యం 2020-21 కరోనా కాలాన్ని ఆసరా చేసుకుని మత్తడిని జెసిబిలతో కూల్చి, గండి కొట్టడమే కాకుండా చెరువు కట్టను పూర్తిగా ధ్వంసం చేసి భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే ఏకంగా డి.ఎం.ఎఫ్.టీ. నిధులతో ఈ వెంచర్‌కు రోడ్డు కూడా వేయించారని అన్నారు. ఈ వెంచర్ లో ఆయనకు ఇల్లు కూడా ఉందని అన్నా రు. రియల్ ఎస్టేట్ వ్యాపారి ఈ చెరువు విషయంలో మాట్లాడిన అందరినీ డబ్బు లతో ప్రలోభ పెట్టి కొనేశారని వారు ఆరోపించారు. గత నాలుగు సంవత్సరాలుగా అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చెరువు ధ్వంసానికి, చెరువు భూమి కబ్జాకు పాల్పడుతున్న వారిపై, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు టి మణిరాం సింగ్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎండి చాంద్ పాషా, ఏఐకెఎస్ రాష్ట్ర కార్యదర్శి గోగర్ల శంకర్, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, గోడిసెల లక్ష్మి, దుగుట రాజకుమార్, చొప్పదండి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సేవకు చిరునామా మెగాస్టార్ చిరంజీవి

**వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23:**
తెలుగు చలనచిత్ర రంగంలో సామాజిక కార్యక్రమాల్లో మెగాస్టార్ చిరంజీవి సేవలు చిరస్మరణీయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినోత్సవ వారోత్సవాల సందర్భంగా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం పట్టణ సమీపంలో ఉన్న ఎదురుగడ్డలోని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ స్వగృహంలో సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడారు. ఎటువంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా కేవలం కష్టాన్ని నమ్ముకుని అద్భుతమైన నటనతో అత్యున్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి చిరంజీవి అని పేర్కొన్నారు. సమాజసేవకుడిగా బ్లడ్ బ్యాంకును, ఐ బ్యాంకు ను ఏర్పాటు చేసి లక్షలాది మందికి రక్తదానాన్ని నేత్రదానాన్ని అందిస్తూ ఎవరు సాటిరాని మైటీ మెగాస్టార్ చిరంజీవి అందరికీ స్ఫూర్తి దాయకుడని కొనియాడారు. ఈ క్యాక్రమంలో మద్దెల బృందం చిరు పాటలు పాడి మురిపించింది. ఈ సందర్భంగా మైటీ మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీరామదాసు నాయక్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మద్దెల శివకుమార్, సంఘ ప్రధాన కార్యదర్శి అపర బాలు అల్లిశంకర్, సంఘ గౌరవ అధ్యక్షులు ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణ స్వామి, సంఘ సభ్యులు వాసం రామకృష్ణ, గుగులోతు కృష్ణ, బోడా గణేష్, సామంతుల శంకర్, అంతోటి పాల్, చిప్ప రాంప్రసాద్, బట్టు జుమ్కీలాల్, కోటి, రవీందర్ కాన్సిరాం, రఘు, నరసింహ, శంకర్ పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**జనంపవర్, లక్షెట్టిపేట, 23 ఆగస్టు:** ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డులను సందర్శించారు. 4వ వార్డులోని తిలక్ నగర్‌లో జ్వరాలతో బాధపడుతున్న ప్రజలతో మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల మందు, బ్లీచింగ్ పిచికారి చేయాలని మున్సిపల్ సానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజశేఖర్, సానిటరీ ఇన్స్పెక్టర్ కందుల రాజేష్, వార్డు అధికారి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# నర్సింగ్ కళాశాలలో రికార్డుల పరిశీలన

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23:** పుల్లిపాటి నర్సింగ్ కళాశాలల తీరుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కొత్తగూడెంలో ఉన్న కళాశాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఎస్.జయలక్ష్మి సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నారా లేదా అనే అంశంపై ఆరా తీశారు. విద్యార్థులు సాధ్యమైనంత ఉత్తమ శిక్షణ పొందేలా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్శనలో డిప్యూటీ డెమో మొహమ్మద్ ఫైజ్మోహియుద్దీన్ పాల్గొన్నారు.

# బంగారంతో మాయమైన ఎస్బీఐ క్యాషియర్

**జనం పవర్, చెన్నూర్, ఆగస్టు 23:** చెన్నూరు పట్టణంలోని ఎస్‌బిఐ లోని క్యాషియర్ బంగారంతో అదృశ్యమయ్యాడు. జైపూర్ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన రవీందర్ సుమారు రూ.12 కోట్ల బంగారంతో పరారైనట్లు సమాచారం. గత మూడు రోజులుగా ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులకు సుమారు 12 కోట్ల విలువైన బంగారం, కోటి పది లక్షల నగదు లేనట్లు అధికారులు గుర్తించారు. 450 మంది బ్యాంకు ఖాతాదారుల నుండి తాకట్టు పెట్టుకున్న బంగారం లేకపోవడంతో బ్యాంకు దగ్గరికి వచ్చి ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

# సింగరేణిలో లాభాలు ప్రకటించి 40 శాతం బోనస్ ఇవ్వాలి

**ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్**



**జనం పవర్, బెల్లంపల్లి, ఆగస్టు 23:** సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 40 శాతం కార్మికులకు బోనస్ చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలోని ఖైరుగూడా ఓపెన్ కాస్ట్ నుండి గోలేటి సీహెచ్‌పీకి బొగ్గును రవాణా చేసే లారీ డ్రైవర్లు, క్లీనర్ లు సింగరేణి సంస్థకు వేలకోట్ల రూపాయలు లాభాలు రావడంలోను, సింగరేణి సంస్థ అభి వృద్ధి చెందడంలో ట్రాన్స్పోర్ట్ కార్మికులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. గత అనేక సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులకు గత సంవత్సరం సింగరేణి యాజ మాన్యం లాభాల్లో వాటా కింద స్పెషల్ ఇన్సెంటివ్ గా రూ.5000/- చెల్లించిందని అన్నారు. ఇప్పుడు కూడా లాభాల్లో వాటా వెంటనే ప్రకటించి ఉద్యోగులతో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తిరుపతి,అశోక్,లచ్చన్న,రవి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# వస్తున్నారు... మన శంకరవరప్రసాద్‌గారు

''చిరంజీవి పాట...ఆయన ఆట..మేనరిజమ్స్, ఫైట్స్, లుక్స్‌ని అభిమానిస్తూ అనుకరించేవాళ్లు ఎంతోమంది. ఎక్కడో ఒక చోట ఆయన ప్రభావం తప్పకుండా ఉంటుంది. అలాంటి చిరంజీవిని నా కంటితో ఎలా చూడాలనుకున్నానో అలా చూపించే అవకాశం ఈ సినిమాతో వచ్చింది'' అన్నారు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నయనతార కథానాయిక. మరో అగ్ర కథానాయకుడు వెంకటేశ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మాతలు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఈ సినిమా పేరుతో కూడిన ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. సినిమాకి 'మన శంకరవరప్రసాద్‌గారు' అనే పేరుని ఖరారు చేశారు. పండగకి వస్తున్నారు..అనేది ఉపశీర్షిక. అభిమానుల సమక్షంలో జరిగిన ప్రచార చిత్రం విడుదల వేడుకలో దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ ''మెగాస్టార్ చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో సినిమా చేసే అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూశా. ఆ అవకాశం ఈ సినిమాతో వచ్చింది. పాటలు, వినోదం అద్భుతంగా కుదిరాయి. ప్రచార చిత్రం కథానాయకుడు వెంకటేశ్ వాయిస్‌తో వినిపిస్తుంది. ప్రస్తుతానికి ఆయన వాయిసే ఇచ్చారు. త్వరలోనే ఈ సినిమా సెట్‌లోకి కూడా అడుగు పెట్టబోతున్నారు. ఈ సినిమా కోసం కథానాయకుడు చిరంజీవి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ బరువు తగ్గారు. అద్భుతమైన లుక్‌లో కనిపిస్తారు'' అన్నారు. అనంతరం విలేకర్లతో అనిల్ రావిపూడి మాట్లాడుతూ ''సరిపోయే కథ దొరికితే చిరంజీవి - బాలకృష్ణలతో కలిసి సినిమా చేయడానికీ సిద్ధమే. విభిన్నమైన వాళ్ల మేనరిజమ్స్‌కి తగ్గ కథ కుదరాల్సి ఉంటుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, సంగీత దర్శకుడు భీమ్స్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

### బాబీ దర్శకత్వంలో మరోసారి

చిరంజీవి హీరోగా బాబీ తెరకెక్కించనున్న రెండో సినిమాని శుక్రవారం ప్రకటించింది నిర్మాణ సంస్థ కె.వి.ఎన్.ప్రొడక్షన్స్. తమిళంలో అగ్ర హీరోలతో సినిమాలు చేస్తున్న ఈ సంస్థ తెలుగులోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న తొలి చిత్రమిది. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా కాన్సెప్ట్ పోస్టర్‌ని విడుదల చేస్తూ, ఈ ఏడాది చివర్లో చిత్రీకరణ మొదలవుతుందని తెలిపాయి సినీ వర్గాలు. విజయవంతమైన 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరు- బాబీ కలయికలో రూపొందుతున్న సినిమా ఇది.




# ఎన్టీఆర్ డ్యాన్స్ .. అప్పటి సంగతులు గుర్తుచేసుకున్న శ్రీలీల తల్లి



ప్రముఖ నటుడు ఎన్టీఆర్ పై నటి శ్రీలీల తల్లి, డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తి అని తెలిపారు. జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్‌షోలో శ్రీలీల, స్వర్ణలత పాల్గొన్నారు. బాల్యంలో ఎన్టీఆర్ కూచిపూడి నృత్య ప్రదర్శనకు సంబంధించిన ఫొటోని డిస్‌ప్లే చేయగా.. స్వర్ణలత నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ''నాకు అమ్మాయి పుడితే డ్యాన్స్ నేర్పించాలని నిర్ణయించుకున్న క్షణాల్ని గుర్తుచేసే ఫొటో ఇది'' అని తెలిపారు. అప్పుడు ఎన్టీఆర్‌తో మీరు మాట్లాడారా? అని అడగ్గా.. ''1997లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన 'తానా' సభల్లో మాట్లాడా. అనుకున్నట్టే శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించా'' అని స్వర్ణలత తెలిపారు. తాను తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడగలనని, కొత్త భాష నేర్చుకోవడం ఎప్పుడూ ఆసక్తే అని శ్రీలీల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'కెరీర్‌లో దూసుకెళుతున్నావ్. వేరే హీరోయిన్ల అవకాశాలు కూడా తీసుకుంటున్నావ్' అని జగపతి బాబు సరదాగా అన్నారు. ఈ ఎపిసోడ్ ఓటీటీ 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. తొలి ఎపిసోడ్‌లో ప్రముఖ నటుడు నాగార్జున సందడి చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల 'జూనియర్' మూవీతో ప్రేక్షకులను పలకరించిన శ్రీలీల.. 'మాస్ జాతర', 'పరాశక్తి' 'ఉస్తాద్ భగత్‌సింగ్' తదితర చిత్రాల్లో నటిస్తున్నారు. ఎన్టీఆర్ కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన సంగతి తెలిసిందే. 12 ఏళ్ల సాధనలో వందకిపైగా ప్రదర్శనలిచ్చారు.






# క్రికెట్‌కు గౌహర్ వీడ్కోలు

హైదరాబాద్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. 2008లో పాకిస్థాన్‌పై అరంగేట్రం చేసిన 37 ఏళ్ల గౌహర్.. భారత్ తరఫున 50 వన్డేలు, 37 టీ20లు ఆడింది. ఆమె 2014 ఏప్రిల్‌లో పాకిస్థాన్‌పై చివరి అంతర్జాతీయ మ్యాచ్ (టీ20)లో కనబడింది. గౌహర్ వన్డేల్లో 66 వికెట్లు.. టీ20ల్లో 29 వికెట్లు పడగొట్టింది. 2009, 2013 వన్డే ప్రపంచకప్‌ల్లోనూ ఆడి 11 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీసింది. 2009-2014 మధ్య మూడు టీ20 ప్రపంచకప్‌లలో పాల్గొని ఏడు వికెట్లు పడగొట్టింది. సుదీర్ఘ విరామం వచ్చినా.. 2024 డబ్ల్యూపీఎల్‌లో గౌహర్ యూపీ వారియర్స్ తరఫున పునరాగమనం చేసింది. ఈ ఏడాది లీగ్‌లోనూ ఆడింది. ప్రస్తుతం ఆమె బీసీసీఐ కోచ్‌గా పని చేస్తోంది. ''భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం.. ప్రపంచకప్‌లలో ఆడడం ఎంతో గర్వంగా భావిస్తున్నా'' అని గౌహర్ తెలిపింది.

## కూత కాస్త కొత్తగా

# ప్రో కబడ్డీ ఫార్మాట్‌లో మార్పులు

కూతకు రంగం సిద్ధమవుతోంది. ఈసారి ప్రో కబడ్డీ సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆగస్టు 29న ఆరంభంకానున్న పన్నెండో సీజన్‌లో టై అన్న మాటే వినిపించదు. ఉత్కంఠభరిత పోరాటాలతో రెండు జట్ల స్కోర్లు సమమైతే.. గోల్డెన్ రైడ్ ద్వారా ఫలితం రాబడతారు. గతంలో ప్లేఆఫ్స్‌కు పరిమితమైన ఈ నిబంధనను లీగ్ దశలోనూ అమలుచేయనున్నారు. మొత్తం 12 జట్ల మధ్య సమరంలో ఎనిమిది జట్లు తర్వాతి దశకు చేరుకుంటాయి. ఫైనల్లో చోటు కోసం ఆయా జట్ల స్థానాల ఆధారంగా మ్యాచ్‌లుంటాయి. ఈసారి కొత్తగా అమలు చేయనున్న ఫార్మాట్‌ను, నిబంధనలను ప్రోకబడ్డీ శుక్రవారం వెల్లడించింది.

**టైబ్రేకర్ నిబంధన:** మ్యాచ్ టై అయితే గోల్డెన్ రైడ్ నిబంధన అమల్లోకి వస్తుంది. ఫలితం తేల్చేందుకు ప్రతి జట్టుకు అయిదు రైడ్ అవకాశాలను ఇస్తారు. అత్యధిక పాయింట్లు సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు. అయిదు రైడ్‌లు ముగిసినా స్కోర్లు సమమైతే మళ్లీ గోల్డెన్ రైడ్ నిబంధనను అమలుచేస్తారు. మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు రెండు పాయింట్లు లభిస్తాయి.

**ఎనిమిది జట్లకు ఫైనల్ అవకాశం:** లీగ్ దశ ముగిశాక అగ్రస్థానంలోని ఎనిమిది జట్లకు ఫైనల్ చేరేందుకు అవకాశం లభిస్తుంది. అయితే లీగ్ దశలో ఆయా జట్ల స్థానాల ఆధారంగా ఫైనల్ చేరే దారి నిర్ణయమవుతుంది.

- లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వాలిఫయర్-1లో పోటీపడతాయి. గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత పొందుతుంది. ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2లో ఆడే అవకాశం లభిస్తుంది.
- 5వ, 8వ స్థానం సాధించిన జట్ల మధ్య, 6వ, 7వ స్థానంలోని జట్ల మధ్య ప్లేఇన్ మ్యాచ్‌లు ఆడిస్తారు. ఈ రెండు మ్యాచ్‌ల్లో విజేతలు ఎలిమినేటర్-1కు చేరతాయి. ఈ రెండు జట్ల మధ్య విజేత ఎలిమినేటర్-2కు అర్హత సాధిస్తుంది.




- 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లు మినీ క్వాలిఫయర్‌లో పోటీపడతాయి. విజేత జట్టు ఎలిమినేటర్-3కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు ఎలిమినేటర్-2కు వెళ్తుంది.
- ఎలిమినేటర్-2లో విజేత ఎలిమినేటర్-3కు వస్తుంది. ఎలిమినేటర్-3లో విజేత క్వాలిఫయర్-2కు అర్హత పొందుతుంది. క్వాలిఫయర్-2లో విజేత ఫైనల్ చేరుతుంది.

### 12 జట్లు

హరియాణ స్టీలర్స్, దబంగ్ దిల్లీ, యూపీ యోధాస్, పట్నా పైరేట్స్, యు ముంబ, జైపూర్ పింక్ పాంథర్స్, తెలుగు టైటాన్స్, పుణెరి పల్టాన్, తమిళ్ తలైవాస్, బెంగాల్ వారియర్జ్, గుజరాత్ జెయింట్స్, బెంగళూరు బుల్స్

### నాలుగు వేదికల్లో..

విశాఖపట్నంలో ఆగస్టు 29న ప్రొకబడ్డీ ఆరంభమవుతుంది. సెప్టెంబరు 11 వరకు తొలి అంచె పోటీలు అక్కడే జరుగుతాయి. ఆ తర్వాత జైపూర్, చెన్నై, చివరకు దిల్లీలో అక్టోబరు 23న జరిగే ఫైనల్‌తో ఈ సీజన్ ముగుస్తుంది. లీగ్ దశలో మొత్తం 108 మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు 18 మ్యాచ్‌లు ఆడుతుంది.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL TEL/2016/69862, EDITOR:BANDARI MARUTHI.